

ముగిసిన 'కార్తీకం'

- చివరిరోజున పోలి పాడ్యమి దీపాలు



అంబాజీపేట మండలం మాచవరంలో పోలిపాడ్యమి సందర్భంగా దీపాలు వెలిగిస్తున్న భక్తులు



ద్రాక్షారామలో సప్తగోదావరి నదిఒడ్డున పాడ్యమి దీపాలు పెడుతున్న మహిళలు

జిల్లాకు పొంచిఉన్న 'సెన్‌యార్'

- జిల్లాలో చాలాచోట్ల ఇంకా ప్రారంభం కాని ఖరీఫ్ కోతలు
- అన్నదాతలో తీవ్రమైన అలజడి
- 26 నుంచి ప్రభావం చూపే అవకాశం

అమలాపురం, నవంబరు 21(ఆంధ్రజ్యోతి): నెలరోజులు తిరగకుండానే మరో తుఫాన్ పొంచి ఉండడంతో అన్నదాతల్లో అలజడి మొదలైంది. ఇప్పటికే భారీ వర్షాలు, మొంథా తుఫాన్ ప్రభావంతో నష్టాలు చవిచూసిన జిల్లా రైతులకు మరో తుఫాన్ గండం ముంచుకొస్తోంది. బంగాళాఖాతంలో ఏర్పడిన అల్పపీడనం ఈ నెల 26 నుంచి తీవ్ర వాయుగుండంగా మారవచ్చునని, తర్వాత 28 నుంచి 30వ తేదీ మధ్య నెల్లూరు-కాకినాడ వైపు కదిలే అవకాశంతోపాటు తీవ్ర తుఫాన్‌గా మారే ప్రమాదం ఉన్న దృష్ట్యా అధికారులు అప్రమత్తంగా ఉండాలని వాతావరణశాఖ ఇప్పటికే హెచ్చరించింది. దీని ప్రభావం వల్ల తమిళనాడు, ఉత్తరాంధ్రలోని అన్ని ప్రాంతాల్లోను 50 నుంచి 90 కిలోమీటర్ల మేర గాలులు వీచే ప్రమాదం ఉందని సమాచారం. దీంతో ఇప్పుడు మరో తుఫాన్ పొంచి ఉండడంతో అన్నదాతలు తీవ్రమైన ఆందోళన చెందుతున్నారు. జిల్లాలో 75శాతానికి పైగా భూముల్లో కోతలు ఇంకా ప్రారంభం కాలేదు. మండపేట, రామచంద్రపురం ప్రాంతాల్లో వరి కోతలు కొనసాగుతుండగా కోనసీమ ప్రాంతంలో ఇంకా పంట ఈనిక దశలోనే వరిచేలు ఉన్నాయి. ఇప్పుడు మళ్లీ తుఫాన్ వస్తే పంటలకు తీవ్రనష్టం వాటిల్లుతుందని అన్నదాతలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. వరుసగా ప్రకృతి వైపరీత్యాలు రైతులపై పగపడుతున్న పరిస్థితులతో వారు తీవ్రమైన అలజడికి గురవుతున్నారు. చేతికి వచ్చిన పంట చేజారిపోయే పరిస్థితులతో వారి ఆవేదన వర్ణనాతీతంగా ఉంది.

రేపటి నేతలుగా..

- మాక్ అసెంబ్లీకి జిల్లానుంచి 8మంది విద్యార్థుల ఎంపిక
- రాజ్యాంగ దినోత్సవం రోజున 26న అమరావతిలో కార్యక్రమం

అమలాపురంరూరల్,నవంబరు 21(ఆంధ్రజ్యోతి): ఈనెల 26న రాజ్యాంగ దినోత్సవం సందర్భంగా అమరావతిలో మాక్ అసెంబ్లీ నిర్వహించనున్నారు. రాష్ట్రంలోని 175 అసెంబ్లీ నియోజకవర్గాలనుంచి ఒక్కొక్కరుగా ఎంపికైన విద్యార్థులే ఎమ్మెల్యేలుగా, మంత్రులుగా, స్పీకర్‌గా మాక్ అసెంబ్లీ జరుగుతుంది. విద్యార్థి దశ నుంచి నాయకత్వ లక్షణాలు పెంపొందించి ప్రజాస్వామ్యంపై అవగాహన పెంపొందించే దిశగా ప్రభుత్వం ఈ కార్యక్రమం చేపట్టినట్టు డీఈవో షేక్ సలీంబాషా తెలిపారు.రాష్ట్రంలోని 175మంది ఎమ్మెల్యేలు మాదిరిగా 175మంది విద్యార్థులు ఈపోటీల్లో పాల్గొంటారని ఆయన తెలిపారు.

జిల్లా నుంచి ఎంపికైనది వీరే

అమరావతిలో జరిగే రాజ్యాంగ దినోత్సవానికి అత్యధికంగా జిల్లానుంచి 8మంది విద్యార్థులు ఎంపికయ్యారు. వారిలో అమలాపురం అసెంబ్లీ నియోజకవర్గం నుంచి ఎన్.జెస్సిక(జడ్పీహెచ్ఎస్ గొల్లవిల్లి), మండపేట నియోజకవర్గం నుంచి పి.కల్యాణి (జీడ్పీహెచ్ఎస్ నల్లూరు), ముమ్మిడివరం నియోజకవర్గం నుంచి వై.జోషిత(జడ్పీహెచ్ఎస్ పి.లక్ష్మీవాడ), కొత్తపేట నియోజకవర్గంనుంచి ఎ.లోకేశ్‌కుమార్(ప్రభుత్వ ఉన్నత పాఠశాల, ఆలమూరు),పి.గన్నవరం నియోజకవర్గం నుంచి ఎస్.పుష్కర్‌విఘ్నేష్ (ముక్తేశ్వరం జడ్పీహెచ్ఎస్), రామచంద్రపురం నియోజకవర్గం నుంచి వై.సహస్ర (జడ్పీహెచ్ఎస్ కాజులూరు), డి.మోహన శ్రీసత్యనారాయణ (రామచంద్రపురం), రాజోలు నియోజకవర్గం నుంచి ఎం.సన్నీ(జడ్పీహెచ్ఎస్ కడలి) విద్యార్థులు ఎంపికయ్యారు. వీరు 26న రాష్ట్రస్థాయిలో జరిగే పోటీల్లో పాల్గొంటారని సీఈవో తెలిపారు.

మళ్లీ గుంతలు!

- మొంథా తుఫాన్‌తో రహదారులకు తూట్లు



మండపేట- ఆలమూరు రోడ్డు దుస్థితి

- అధ్వానంగా ఆర్అండ్‌బీ, పంచాయతీరాజ్ రహదారులు
- వర్షాలు, తుఫాన్లతో దారుణంగా మారిన రహదారులు
- ప్రతిపాదనలతో సరి.. నిధుల కోసం ఎదురుచూపులు



ముమ్మిడివరం మండలంలో అయినాపురం వద్ద ఆర్అండ్‌బీ రోడ్డు దుస్థితి.. కపిలేశ్వరపురం మండలంలో కోరుమిల్లి-తాతపూడి ఏటిగట్టు రహదారి, అంతర్వేది దండుపుంత రహదారి దుస్థితి

(అమలాపురం-ఆంధ్రజ్యోతి)

జిల్లాలోని ఆర్అండ్‌బీ, పంచాయతీరాజ్ సహా వివిధ రహదారులు అధ్వాన స్థితికి చేరుకున్నాయి. ఇటీవల కురిసిన భారీవర్షాలు, మొంథా తుఫాన్ ప్రభావం వల్ల రహదారులన్నీ దారుణంగా దెబ్బతిన్నాయి. భారీగొయ్యిలు, రోడ్లు ఛిద్రమై రాళ్లు లేచిపోవడంతో ప్రయాణికులు ప్రమాదకర స్థితిలో వాహనాలు నడుపుతున్నారు. తరచూ కొంతమంది ప్రమాదాలకు కూడా గురవుతున్నారు. మొంథా తుఫాను సమయంలో 31.7 కిలోమీటర్ల పంచాయతీరాజ్ రహదారులు ధ్వంసమయ్యాయి. ముఖ్యంగా 90 కిలోమీటర్ల తీరం వెంబడి ఉన్న మత్స్యకార గ్రామాల్లో రహదారుల పరిస్థితి అధ్వానంగా మారింది. ప్రభుత్వం రహదారుల అభివృద్ధికి నిధులు విడుదల చేస్తే తప్ప ప్రజల కష్టాలు తీరవని ప్రజాప్రతినిధులు సైతం ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. అమలాపురం-ముక్కామల కెనాల్ రోడ్డు కుంగిపోతున్న పరిస్థితి ప్రయాణికుల పాలిట శాపంగా మారుతోంది. ముఖ్యంగా రాజోలు అసెంబ్లీ నియోజకవర్గ పరిధిలో మలికిపురం గుడిమెళ్లంక వంతెన నుంచి చింతలపల్లి కళింగల వరకు ఉన్న ఆర్అండ్‌బీ రహదారి నరక కూపంగా మారింది. మలికిపురం గుడిమెళ్లంక వంతెన నుంచి విశ్వేశ్వరాయపురం ప్లీడరు గారి మలుపు వరకు, ఇదే రోడ్డు లక్కవరం నుంచి చింతలపల్లి కళింగల వరకు భారీ గోతులుగా మారింది. చింతలపల్లి నుంచి లక్కవరం వరకు 3 కిలోమీటర్లు, ప్లీడరుగారి మలుపు నుంచి రెండు కిలోమీటర్లు ప్రధాన రహదారి పెద్దపెద్ద గోతులుగా మారింది. గతంలో ఎన్డీబీలో నిధులు మంజూరై పనులు జరగక ఆ గ్రాంటు రద్దు అయింది. కొత్తగా ఈ రెండు చోట్ల రోడ్లు నిర్మించాల్సి ఉంది. కొత్తపేట మండలం బోడిపాలెం, వాడపాలెం రోడ్డు దారుణస్థితికి చేరి తరచూ ప్రమాదాలు సంభవిస్తున్నాయి. పలివెల- కొత్తపేట రోడ్డు అధ్వానంగా మారింది. ముమ్మిడివరం మండలం నుంచి అయినవిల్లి మండలానికి వెళ్లే ముమ్మిడివరం-ముక్తేశ్వరం ఆర్అండ్‌బీ రోడ్డు బాగా దెబ్బతింది. 9.8 కిలోమీటర్ల నిడివి గల ఈ రోడ్డును 8.7 మీటర్ల మేర ఆధునికీకరణకు రూ.2.15 కోట్లు మంజూరైంది. టెండర్ల ప్రక్రియ పూర్తయి త్వరలోనే పనులు చేపట్టాల్సి ఉంది. రాజోలు మండలం చింతలపల్లి కళింగలు వద్ద నుంచి మలికిపురం మండలం లక్కవరం వరకు, విశ్వేశ్వరాయపురం ప్లీడరుగారి మలుపు నుంచి గుడిమెళ్లంక వంతెన వరకు 4.4 కిలోమీటర్ల రోడ్డు అధ్వానంగా పెద్దపెద్ద గోతులతో దర్శనమిస్తోంది. ఈ రోడ్డుపై ప్రయాణం ప్రజలకు నరకప్రాయంగా మారంది. రాత్రి సమయాల్లో ఈ రోడ్డు మీదుగా ప్రయాణించాలంటే వాహనదారులు గొయ్యిలో పడి ప్రమాదాలకు గురవుతున్నారు. రోడ్డు మీద ఉన్న రాళ్లు పైకి రావడంతో వాహనదారులు, ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ఇక మండపేట నుంచి జొన్నాడ వరకు ఉన్న ఆలమూరు మెయిన్ రోడ్డు దుస్థితి మరీ దారుణంగా మారింది. రోడ్డు పొడవునా గోతులతో నిండిపోయింది. వాహనదారులు ఇటువైపు వెళ్లడం నరకంగా భావిస్తున్నారు. అలాగే కపిలేశ్వరపురం నుంచి మండపేట వెళ్లే ఆర్అండ్‌బీ ప్రధాన రహదారి, కోరుమిల్లి నుంచి తాతపూడి, జొన్నాడ వెళ్లే ఏటిగట్టు రహదార్లు అధ్వానంగా మారాయి. సఖినేటిపల్లి మండలంలో అంతర్వేది దండుపుంత ప్రధాన రహదారి, వీవీ మెరక నుంచి మోరి మహాలక్ష్మమ్మ గుడికి వెళ్లే రహదారి, సఖినేటిపల్లి నుంచి అంతర్వేది వెళ్లే రోడ్లు ఘోరంగా మారాయి.

మత్స్యకారులకు ప్రత్యామ్నాయ జీవనోపాధి



చిర్రయానంలో సముద్రపు నాచును పరిశీలిస్తున్న కలెక్టర్, ఎమ్మెల్యే

- సముద్రపు నాచు తయారీ ద్వారా పీతలు, ఆర్నమెంటు చేపల పెంపకం
- తీరప్రాంతంలో 12 ప్రాజెక్టులకు కలెక్టర్ అనుమతి

(అమలాపురం-ఆంధ్రజ్యోతి)

మత్స్యకారుల ప్రత్యామ్నాయ జీవనోపాధిపై రాష్ట్రప్రభుత్వం దృష్టిసారించింది. సముద్రతీరప్రాంతంలో మత్స్యకారులతోపాటు డ్వాక్రా మహిళా సంఘాలకు ఉపాధిమార్గాలను పెంపొందించే లక్ష్యంతో సముద్రపు నాచు ఉత్పత్తి ద్వారా పీతలు, ఆర్నమెంటు చేపల పెంపకంపై దృష్టిపెట్టింది. దీనికి సబ్సిడీతో కూడిన రుణాలను మంజూరు చేశారు.

సముద్రతీరం వెంబడి ఉన్న కోనసీమ జిల్లాలో 12 ప్రాజెక్టులను ఎంపిక చేసి మత్స్యకార డ్వాక్రా మహిళలకు ఉపాధి మార్గాలను చేరువచేసింది. తదుపరి దశలో మరో పది యూనిట్ల ద్వారా పీతల పెంపకం, ఏడు యూనిట్ల ద్వారా ఆర్నమెంటు చేపల పెంపకానికి శ్రీకారం చుట్టనున్నారు. ఇందుకోసం మొత్తం 29 యూనిట్లకు రూ.11.10 లక్షల అంచనా వ్యయంతో ప్రాజెక్టులు చేపట్టారు. సముద్రపు నాచు సాగు యూనిట్‌కు పెట్టుబడి వ్యయంగా రూ.18వేలు, దీనిలో గ్రీన్ క్లయిమేట్ ఫండ్ సబ్సిడీగా రూ.11,662, ప్రధానమంత్రి మత్స్యసంపద యోజన కింద సబ్సిడీగా రూ.6338ను అందించనున్నారు. అదనంగా డ్వాక్రా రుణం కూడా అందించడం ద్వారా మహిళలను భాగస్వామ్యం చేయనున్నారు. మొత్తం వ్యయంలో గ్రీన్ క్లయిమేట్ ఫండ్ సబ్సిడీగా రూ.19,404 లభిస్తుంది. రంగు చేపల(ఆర్నమెంటు చేపలు) పెంపకం యూనిట్లు రూ. లక్ష పెట్టుబడి వ్యయంలో గ్రీన్ క్లయిమేట్ సబ్సిడీ రూ.45,948, ప్రధానమంత్రి మత్స్యసంపద యోజన కింద రూ.54,052 రాయితీగా లభిస్తాయి. పర్యావరణ వ్యవసాయానికి, దీర్ఘకాలిక లాభాలు అందించడంలో కీలకంగా ఉపయోగపడతాయి. ప్రకృతి సహజమైన నాచు తయారీకి తక్కువ పెట్టుబడితో అధిక లాభాలు ఆర్జించడమే ఈ సాగు లక్ష్యం. కేవలం 45రోజుల కాలవ్యవధిలో అధిక ఆదాయం పొందవచ్చని ఇప్పటికే శాస్త్రవేత్తలు పేర్కొన్నారు. నాచు తయారీకి అనువైన ఉష్ణోగ్రతలు, ఉప్పు శాతం, నీటి పరిసరాల మంచి ఫలితాలు ఇస్తాయి. ఈ ఉత్పత్తుల పెంపు సాంకేతికత ప్రోత్సాహకానికి ప్రభుత్వం కృషి చేయడంతోపాటు నీలి విప్లవం సాధించే దిశగా ముందు అడుగు వేస్తుంది. ముఖ్యంగా మత్స్యకార కుటుంబాల జీవనోపాధికి మార్గం సుగమం చేస్తుంది. పశుగ్రాసంగా చేపలకు, కోళ్లకు మేతగా కూడా నాచును ఉపయోగించుకోవచ్చు. ఐరన్, మెగ్నీషియం, జింక్ వంటి ఖనిజాలు ఉన్న ఈ నాచు ఔషధ పదార్థాలు, పోషక పదార్థాల తయారీకి ఉపయోగించవచ్చునని నిపుణులు పేర్కొంటున్నారు. ఇప్పుడు ప్రస్తుతం జిల్లాలోని తీరప్రాంతాల్లో 12 ప్రాజెక్టులకు కలెక్టర్ మహేష్‌కుమార్ శుక్రవారం ప్రారంభించి ధ్రువపత్రాలను డ్వాక్రా సంఘాల మహిళలకు ప్రాజెక్టు నిర్వాహకులకు అందించారు.

26న 'రాజోలు'లో డిప్యూటీ సీఎం పవన్ పర్యటన



- కేశనపల్లి సహా 12గ్రామాల్లో చనిపోయిన కొబ్బరిచెట్ల పరిశీలన
- పల్లె పండుగలో రోడ్ల నిర్మాణాలకు శంకుస్థాపనలు, ప్రారంభోత్సవాలు
- ఏర్పాట్లపై కలెక్టర్ అధ్యక్షతన జిల్లా ఉన్నతాధికారుల సమీక్ష.. హాజరైన ఎస్పీ
- పర్యటన విజయవంతం చేయాలి: రాజోలు ఎమ్మెల్యే దేవ వరప్రసాద్



డిప్యూటీ సీఎం పర్యటన ఏర్పాట్లపై కలెక్టరేట్‌లో నిర్వహించిన సమీక్షలో కలెక్టర్, ఎస్పీ, ఎమ్మెల్యే, జేసీ, డీఆర్వో

అమలాపురం/మలికిపురం, నవంబరు 21 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ఉపముఖ్యమంత్రి పవన్‌కల్యాణ్ ఈనెల 26న రాజోలు నియోజకవర్గంలో పర్యటించనున్నారు. డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా మలికిపురం మండలం కేశనపల్లిలో ఆ రోజు కొబ్బరి రైతులతో ముఖాముఖిలో పాల్గొననున్నారు.మండలంలో రోడ్ల నిర్మాణాలకు శంకుస్థాపనలు, పలు ప్రారంభోత్సవాలు చేయనున్నారు. ఈ నేపథ్యంలో ఏర్పాట్లపై కోనసీమ జిల్లా కలెక్టర్ ఆర్.మహేష్‌కుమార్ అధ్యక్షతన అమలాపురంలోని కలెక్టరేట్‌లో శుక్రవారం సమావేశం జరిగింది. జిల్లాస్థాయిలో జరిగిన సమావేశానికి రాజోలు ఎమ్మెల్యే దేవవరప్రసాద్, ఎస్పీ రాహుల్‌మీనా, జాయింట్ కలెక్టర్ టి.నిషాంతి, డీఆర్వో కె.మాధవి డిప్యూటీ సీఎం పర్యటన ఏర్పాట్లపై సమీక్ష చేశారు. ఈ నెల 26న 10.30 గంటలకు పవన్‌కల్యాణ్ రాజోలు పర్యటనకు వచ్చే అవకాశం ఉందన్నారు. రాజమహేంద్రవరం నుంచి ప్రత్యేక హెలికాప్టర్‌లో శివకోడులో ఏర్పాటు చేసిన హెలిప్యాడ్‌కు చేరుకుంటారని, అక్కడినుంచి కేశనపల్లి, శంకరగుప్తం డ్రెయిన్‌ను ఆనుకుని ఉన్న 12 గ్రామాల గుండా పర్యటించి దారి పొడవునా చనిపోయిన కొబ్బరిచెట్లను పరిశీలించి బాధిత కొబ్బరి రైతులతో పవన్ మాట్లాడతారని తెలిపారు. తదుపరి శివకోడుకు చేరుకుని జాతీయ రహదారిని ఆనుకుని ఉన్న కాపు కల్యాణ మండపం వద్ద పల్లె పండుగ 2.0 సమావేశంలో పాల్గొంటారని తెలిపారు. రోడ్డు పనులకు శంకుస్థాపన, శిలాఫలకాలను ఆవిష్కరిస్తారన్నారు. దీనిలోభాగంగా నియోజకవర్గానికి సంబంధించి ములికిపల్లి-కాట్రేనిపాడులంక మధ్య 4.5 కిలోమీటర్ల రోడ్డుకు రూ.3.21కోట్లతో పవన్ శంకుస్థాపన చేస్తారు. జాతీయ హరిత ట్రిబ్యునల్ విడుదల చేసిన రూ.5 కోట్లతో గుడిమెళ్లంక మంచినీటి పథకం ర్యాపిడ్ శాండ్ ఫిల్టర్‌శంకుస్థాపన, ఓఎన్జీసీ సీఎస్సార్ నిధులతో రూ.7.50 కోట్లతో నియోజకవర్గంలో ఓహెచ్ఎస్ఆర్‌లకు శంకుస్థాపన చేస్తారు. సామాజిక ఆరోగ్య కేంద్రం రాజోలుకు పరికరాలు పంపిణీ చేస్తారు. నరేగా అనుసంధానంతో రూ.11.45కోట్లతో 177 రోడ్లకు శంకుస్థాపన శిలఫకాలను ఆవిష్కరించనున్నారు. కేశనపల్లి, శివకోడులో హెలిప్యాడ్‌లు సిద్ధం చేయాలని ఎమ్మెల్యే దేవ సూచించారు. పార్టీశ్రేణులు, కూటమి నాయకులు కార్యక్రమాన్ని జయప్రదం చేయాలని కోరారు. శివకోడులో శంకుస్థాపనల అనంతరం బైపాస్‌రోడ్డులో బహిరంగ సభ ఉంటుందన్నారు. పవన్ రెండున్నర గంటలపాటు పర్యటించే అవకాశం ఉన్న దృష్ట్యా పోలీసు అధికారులు కట్టుదిట్టమైన ఏర్పాట్లు చేసి పర్యటనను విజయవంతం చేయాలని జిల్లా ఎస్పీ పోలీసులను ఆదేశించారు.

నగదు రహితమే లక్ష్యంగా..



జాతీయ, రాష్ట్ర రహదారులపై గల టోల్ ప్లాజాల వద్ద టోల్‌ఫీ చెల్లింపులన్నీ నగదు రహితంగా సాగాలన్న లక్ష్యంతో సమూల మార్పులు చేస్తున్నారు. టోల్‌ఫీ చెల్లింపులు ఫాస్టాగ్ ద్వారానే జరిగేలా ప్రోత్సహిస్తూనే నగదు చెల్లిస్తే రెట్టింపు చార్జీలు చెల్లించే విధానం ప్రస్తుతం అమల్లో ఉంది. ఇప్పుడు యూపీఐ ద్వారా చెల్లింపులు చేస్తే 25 శాతం అదనంగా చెల్లిస్తే సరిపోతుందని నేషనల్ హైవే అథారిటీ ఆదేశాలు జారీ చేసింది. ఇప్పటికే వార్షిక పాస్‌లను అమల్లోకి తెచ్చింది.



- టోల్‌ప్లాజాల వద్ద టోల్‌చార్జీల చెల్లింపులో మార్పులు
- ఫాస్టాగ్ ఉంటే సాధారణ చార్జీలే
- నగదు చెల్లిస్తే 100 శాతం అదనం
- యూపీఐ ద్వారా చెల్లింపులు చేస్తే 25 శాతమే అదనం
- ఇప్పటికే అమల్లోకి వార్షిక పాస్‌లు

(ఆంధ్రజ్యోతి-పిఠాపురం)

ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లాలో జాతీయ రహదారి 16పై తుని-రాజమహేంద్రవరం మధ్యలోని కాకినాడ జిల్లా కృష్ణవరం, దివాన్‌చెరువు-సిద్ధాంతం మధ్యలోని డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా ఈతతోట వద్ద టోల్‌ప్లాజాలు ఉండగా, 216వ జాతీయ రహదారిపై కత్తిపూడి-కాకినాడ బైపాస్ మధ్యలో గొల్లప్రోలు వద్ద, గురజనాపల్లి-పాశర్లపూడి మధ్యగల కోనసీమ జిల్లా అన్నంపల్లి వద్ద టోల్‌ప్లాజాలు ఉన్నాయి. ఇవన్నీ నేషనల్ హైవేస్ అథారిటీ ఆఫ్ ఇండియా అధీనంలో ఉన్నాయి. దీంతోపాటు తూర్పు గోదావరి జిల్లాలో ఉన్న కొవ్వూరు వద్ద, నల్లజర్ల మండలం వీరవల్లి వద్ద టోల్‌ప్లాజాలు ఉన్నాయి. ఇవి రాష్ట్ర ప్రభుత్వ సంస్థ అయిన ఏపీఆర్‌డీసీ అధీనంలో ఉన్నాయి. వీటి ద్వారా ప్రయాణాలు సాగించే అన్నిరకాల కార్లు, వ్యాన్‌లు, ఫోర్‌వీలర్ ఆటోలు, లారీలు, బస్సులు, ట్రాలీలు, ఇతర భారీ వాహనాలు ఆయా టోల్‌గేట్ల వద్ద నిర్ణీత రుసుమును ఫాస్టాగ్ ద్వారా చెల్లించాల్సి ఉంటుంది. ఈ చార్జీలను నేషనల్ హైవే అథారిటీ నిర్ణయిస్తుంది. సాధారణంగా రహదారి నిర్మాణానికి అయ్యే వ్యయానికి అనుగుణంగా ఈ చార్జీలను నిర్ణయించి వసూలు చేస్తారు.

ఫాస్టాగ్ లేకుంటే 100 శాతం అదనం

టోల్‌ప్లాజా ద్వారా వెళ్లే ప్రతి వాహనానికి అక్కడ అమల్లో ఉన్న టోల్‌ఫీని వాహనానికి ఉన్న ఫాస్టాగ్ ద్వారా చెల్లించాల్సి ఉంటుంది. టోల్‌ప్లాజా దాటే సమయంలో ఆటోమెటిక్‌గా వాహనానికి చెందిన ఫాస్టాగ్ ద్వారా ఈ రుసుం కట్ అవుతుంది. ఒకవేళ ఫాస్టాగ్ ఖాతాలో సొమ్ములు లేకున్నా, వాహనానికి అసలు ఫాస్టాగ్ లేకున్నా నిర్ణీత రుసుంకంటే 100 శాతం అదనంగా చెల్లించాలి. నగదు చెల్లింపులు చేసేవారికి 24 గంటల వ్యవధిలో రాకపోకలు పూర్తిచేసి టోల్‌ను దాటితే టోల్‌ఫీజు చెల్లింపులో ఉన్న రాయితీలు వర్తించవు. ప్రస్తుతం దేశవ్యాప్తంగా జాతీయ రహదారులు, రాష్ట్ర రహదారులపై ఉన్న టోల్‌ప్లాజాల వద్ద ఇదే విధానం అమలవుతోంది.

యూపీఐ ద్వారా చెల్లిస్తే..

ఫాస్టాగ్‌లో నగదు లేకున్నా, అసలు వాహనానికి ఫాస్టాగ్ లేకున్నా ఇప్పటివరకూ వాహనదారులు నగదు రూపంలోనే 100శాతం అదనంగా టోల్‌గేటుల వద్ద ఫీజులు చెల్లించాల్సి వచ్చేది. ఈ విధానంలో మార్పులు తెస్తూ కేంద్రం జారీ చేసిన సూచనలకు అనుగుణంగా నేషనల్ హైవే అథారిటీ కొత్త విధానాన్ని అమల్లోకి తెచ్చింది. దీని ప్రకారం ఫాస్టాగ్ లేని వాహనదారులు యూపీఐ ద్వారా చెల్లింపులు చేస్తే టోల్‌ఫీజుకు అదనంగా 25 శాతం చెల్లిస్తే సరిపోతుంది. నగదు రహిత లావాదేవీలను ప్రోత్సహించాలనే లక్ష్యంతో ఈ విధానాన్ని నవంబరు 15వ తేదీ నుంచి అమల్లోకి తీసుకువచ్చారు. నగదు చెల్లిస్తే మాత్రం 100శాతం బాదుడును వాహనదారులు భరించాల్సి ఉంటుంది. వచ్చే ఆర్థిక సంవత్సరానికి టోల్‌గేటుల వద్ద ఫీజుల చెల్లింపులు నగదు రూపంలో జరగకూడదనేది కేంద్రం లక్ష్యమని హైవే అథారిటీ అధికారి ఒకరు తెలిపారు.

వార్షిక పాస్‌లకు ఆదరణ

ఫాస్టాగ్ రీచార్జి తరచూ చేసుకునే ఇబ్బంది లేకుండా ఏడాది రుసుం చెల్లించేలా కేంద్రం తీసుకువచ్చిన నూతన విధానానికి వాహనదారులు నుంచి మంచి స్పందన లభిస్తోంది. ఫాస్టాగ్ యాన్యువల్ పాస్‌కోసం ఏడాది కాలానికి రూ.3వేలు చెల్లించాల్సి ఉంటుంది. ఈ ఫాస్టాగ్ రీచార్జి ఏడాది కాలానికి అమలులో ఉంటుంది. ఇలా రీచార్జి చేయించిన వాహనం దేశవ్యాప్తంగా జాతీయ రహదారులపై గల ఏ టోల్‌ప్లాజా ద్వారానైనా 200సార్లు ప్రయాణించే అవకాశం ఉంది. ఏడాది లేదా 200సార్లు ఏదిముందైతే దాన్ని పరిగణలోకి తీసుకుంటారు. కార్లు, జీపులు, వ్యాన్‌లు వంటి వ్యక్తిగత అవసరాల నిమిత్తం తిరిగే వాహనాలకే ఫాస్టాగ్ యాన్యువల్ పాస్‌ను వర్తింపజేశారు. వాణిజ్య అవసరాలకు తిరిగే వాహనాలకు ఇది వినియోగించుకునే అవకాశం ఉండదు. రాష్ట్ర రహదారులు, ఇతర ప్రాంతాల్లోని టోల్‌గేట్‌ల వద్ద మాత్రం సాధారణ పద్ధతిలో ఫాస్టాగ్ ద్వారా టోల్‌ఫీ చెల్లించాల్సి ఉంటుంది. ఫాస్టాగ్ లేనివారు చాలావరకు యూపీఐ ద్వారా చెల్లింపులు చేస్తున్నారు.

అటల్ ల్యాబ్స్‌తో సృజనాత్మక ఆలోచనలు

- పాఠశాల స్థాయిలోనే విద్యార్థులకు చేరువ చేయాలి: డీఈవో సలీంబాషా

అమలాపురంరూరల్,నవంబరు 21(ఆంధ్రజ్యోతి): పాఠశాల స్థాయి నుంచి విద్యార్థుల్లో సృజనాత్మక ఆలోచనలను పెంపొందించేలా అటల్ ల్యాబ్స్‌ను విద్యార్థులకు చేరవ చేయాలని జిల్లా విద్యాశాఖాధికారి డాక్టర్ షేక్ సలీంబాషా, సమగ్రశిక్ష అదనపు ప్రాజెక్టు కోఆర్డినేటర్ జి.మమ్మీ తెలిపారు. అమలాపురం పేరూరు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో మూడు రోజులుగా నిర్వహిస్తున్న అటల్ ల్యాబ్స్ పాఠశాలల ఉపాధ్యాయుల వర్క్‌షాపు శుక్రవారం ముగిసింది. పాఠశాల హెచ్ఎం ఎన్.విజయకుమారి అధ్యక్షతన శనివారం నిర్వహించిన ముగింపు సభలో డీఈవో సలీంబాషా, మమ్మీ మాట్లాడుతూ విద్యార్థుల్లో విమర్శనాత్మక ఆలోచన, సమస్య పరిష్కార నైపుణ్యాలను పెంపొందించడంలో ఉపాధ్యాయులు చురుకైన పాత్ర వహించాలన్నారు. విద్యార్థులు పరిశోధనాత్మక ఆలోచనలు చేసే దిశగా ఉపాధ్యాయులు మార్గదర్శనం చేయాలన్నారు. అటల్ ల్యాబ్స్ నిర్వహణలో అలసత్వాన్ని సహించేది లేదని హెచ్చరించారు. జిల్లా సైన్స్ అధికారి జీవీఎస్ సుబ్రహ్మణ్యం నేతృత్వంలో జిల్లాలో సైన్స్ కార్యక్రమాలు సమర్థవంతంగా నిర్వహించడంపట్ల సంతృప్తి వ్యక్తం చేశారు. సమగ్రశిక్ష అకడమిక్ మోనటరింగ్ అధికారి పి.రంబాబు మాట్లాడుతూ జిల్లాలో ఉన్న 45 అటల్ ల్యాబ్స్ ద్వారా సమాజం ఎదుర్కొనే సవాళ్లను అధిగమించేందుకు అవసరమైన పరిష్కార మార్గాలను విద్యార్థులు కనుగొనేలా ప్రోత్సహించాలన్నారు. ప్రతీ శనివారం అటల్, స్టెమ్, సైన్స్ ల్యాబ్స్‌ను జిల్లా సైన్స్ అధికారి సుబ్రహ్మణ్యం సందర్శించి ఉన్నతాధికారులకు నివేదికలు సమర్పిస్తారని తెలిపారు. శిక్షణ పూర్తి చేసుకున్న వారికి సర్టిఫికెట్లు అందజేశారు. సమావేశంలో డీసీఈబీ కార్యదర్శి బీర హనుమంతరావు, సమగ్రశిక్ష సీఎంవో బొరుసు వీవీ సుబ్రహ్మణ్యం, ట్రైనింగ్ ఆర్గనైజర్లు ఎస్.బాబులు, పావని, టి.అనిల్, స్వాతి, హేమచంద్రిక, విష్ణుతో పాటు జిల్లాలోని 45 పాఠశాలలకు చెందిన అటల్ టింకరింగ్ ఇన్‌చార్జిలు పాల్గొన్నారు.


రెడ్ రైస్ పంట

ఏజెన్సీలో ఎర్ర బియ్యం

'తూర్పు' మన్యంలో రెడ్ రైస్ సాగుకు శ్రీకారం

(కూనవరం-ఆంధ్రజ్యోతి)

ఎర్ర బియ్యం... దీనిని ఇప్పటివరకు కేరళ, తమిళనాడు, కర్ణాటక రాష్ట్రాల్లో మాత్రమే పండించేవారు. ఉభయ తెలుగు రాష్ట్రాల్లో కేవలం 600 మంది రైతులు ఈ పంటను పండిస్తున్నారు. ఇప్పుడు దీనిని ఏజెన్సీ ప్రాంతమైన అల్లూరి జిల్లా కూనవరంలోనూ సాగు చేస్తున్నారు. మండలంలోని భీమవరం గ్రామానికి చెందిన రైతు గోళ్ల సత్యనారాయణ ఎర్ర బియ్యం సాగుకు శ్రీకారం చుట్టాడు. విత్తనాలను ఆన్‌లైన్‌లో తెప్పించిన ఈయన తన పొలంలో నాటాడు. సాధారణ వరి రకాలు దిగుబడి 120 రోజుల్లో వస్తే ఈ పంటకు 135 రోజులు పడుతుంది. తెల్ల బియ్యం కంటే ఎర్ర బియ్యంలో పౌష్టికాహార గుణాలు ఎక్కువ. విటమిన్ బీ1, బీ2, బీ6లతో పాటు మాంగనీస్, కాల్షియం, సోడియం, జింక్, ఐరన్ లాంటి ఖనిజాలు పుష్కలంగా ఉంటాయి. క్యాన్సర్ కణాలను తగ్గించడంలో ఈ ఎర్ర బియ్యం ఎంతో దోహదపడతాయి. మధుమేహాన్ని నివారించడంలోను, బీపీ తగ్గించగల సామర్థ్యం కూడా ఎర్ర బియ్యంలో ఉన్నాయి. ఇన్ని పోషకాహారాలు ఉన్న ఈ పంటను ప్రస్తుతం ఒక ఎకరం భూమిలో సాగు చేస్తున్నానని, హెక్టారుకు ఆరు టన్నుల దిగుబడి వచ్చే అవకాశం ఉందని రైతు సత్యనారాయణ 'ఆంధ్రజ్యోతి'కి చెప్పాడు.


కంకుల దశలో ఉన్న పంట


రెడ్ రైస్ పంటను పరిశీలిస్తున్న రైతు సత్యనారాయణ

చిన్నారులను దత్తత తీసుకోవాలని... వారితో అమ్మ, నాన్న అని పిలిపించుకోవాలని చాలా మంది ఆరాటపడతారు. పిల్లలను పెంచుకోవడానికి ఆసక్తి చూపుతారు. అస్తులున్నా.. సంతాన భాగ్యం లేక ఆవేదనతో ఉండే వారు సమాజంలో మరికొందరు ఉంటారు. పిల్లలను పెంచుకోవాలని ఉన్నవారు కొందరు దళారులను ఆశ్రయిస్తుంటారు.



అనాథలుగా మారిన పిల్లలు కూడా సమాజంలో కనిపిస్తుంటారు. పిల్లలను కని నడిరోడ్డుపై వదిలేసి వెళ్లిపోయే మానవత్వం లేని తల్లిదండ్రులు అక్కడక్కడా ఉంటారు. రోజుల వ్యవధిలో ఉన్న చిన్నారులను సైతం రోడ్డుపై వదిలేస్తుంటారు. అలాంటి వారిని చేరదీసి శిశుగృహ సంరక్షణలో ఉంచుతారు శిశుగృహ అధికారులు. వారిని చట్టబద్ధంగా దత్తత ఇస్తూ.. వారికి కొత్త జీవితాన్ని ప్రసాదిస్తున్నారు.

దత్తతకు వేళాయె

- అవగాహన సదస్సులు నిర్వహిస్తున్న మహిళా-శిశు సంక్షేమ శాఖ, బాలల పరిరక్షణ విభాగం అధికారులు
- కాకినాడ, అమలాపురం, రాజమహేంద్రవరంల్లో 'శిశుగృహ'ల నిర్వహణ



(కాకినాడ-ఆంధ్రజ్యోతి)

కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వ మార్గదర్శకాలను అనుసరిస్తూ చట్టబద్ధంగా తీసుకోవడం ఒక వరం. అలాంటి చట్టబద్ధత దత్తతకు సంబంధించిన అవగాహన కార్యక్రమాలను బాలల పరిరక్షణ విభాగం, మహిళా, శిశు సంక్షేమ శాఖ నిర్వహిస్తున్నాయి. దత్తతలో ఉండే వివిధ రకాలైన వెసులుబాట్లు రిలేటివ్ అడాప్షన్ (రక్త సంబంధీకుల దత్తత), స్టెప్ పేరెంటెడ్ ఆప్షన్ తదితర అంశాలపై బాలల పరిరక్షణ సిబ్బంది అవగాహన కల్పించనున్నారు. నవంబరు మాసం అంతా గ్రామ, మండల, డివిజనల్ స్థాయిల్లో దత్తత ప్రచార కార్యక్రమాలను నిర్వహించనున్నారు.

ఎలా దత్తత తీసుకోవచ్చంటే...

మొదటి దశ: ముందుగా పాన్‌కార్డుతో రిజిస్ట్రేషన్ చేయించుకోవాలి. బిడ్డను దత్తత తీసుకోవాలనుకునే దంపతులు తమ పాన్ కార్డుతో కారా (డబ్ల్యుడబ్ల్యుడబ్ల్యు.సీఏఆర్ఏ.ఎన్ఐసీ.ఇన్) వెబ్‌సైట్‌లో రిజిస్ట్రేషన్ చేసుకోవాలి. రసీదు ప్రింటు తీసుకోవాలి.

రెండో దశ:
(ఆన్‌లైన్‌లో ధ్రువీకరణ పత్రాలు అప్‌లోడ్ చేయడం)
- ఫ్యామిలీ ఫొటో (2 ఇంటు 3),
- నివాస ధ్రువీకరణ పత్రం: ఆధార్ కార్డులు, ఓటర్ ఐడీ కార్డులు, పాస్‌పోర్టు, కరెంట్ బిల్లు
- ఆదాయ ధ్రువీకరణ పత్రం: సంవత్సర ఆదాయపత్రం, తహసీల్దారు నుంచి ధ్రువీకరణ.
- వివాహ ధ్రువీకరణ పత్రాన్ని రిజిస్ట్రార్ ఆఫీసు నుంచి తీసుకురావాలి.
- దత్తత తీసుకోబోయే వారి జనన ధ్రువీకరణ పత్రాలు/నోటరీ నుంచి పుట్టిన తేదీ అఫిడవిట్
- తల్లిదండ్రులు ఇద్దరి మెడికల్ టెస్టులు విడివిడిగా ఇవ్వాలి. మెడికల్ ఫిట్‌నెస్ సర్టిఫికెట్లు తీసుకోవాలి.

మూడో దశ:
హోమ్ స్టడీ (గృహ అభ్యసన రిపోర్ట్)

హోమ్ స్టడీ సమయంలో అప్‌లోడ్ చేసిన ధ్రువీకరణ పత్రాలతో ఏదైనా జాతీయ బ్యాంకులో రూ.6వేలు డీడీ తీసి పథక సంచాలకులు, జిల్లా మహిళ, శిశు అభివృద్ధి సంస్థ, కాకినాడ వారికి దరఖాస్తు సమర్పించాలి.

చివరి దశ:
(దత్తత తీసుకోవడం)
- బిడ్డను దత్తత తీసుకునే సంస్థ వారికి రూ.50వేలు డీడీ రూపంలో అందించాలి.
- దత్తత నిర్ధారణ కోసం జిల్లా ఫ్యామిలీ కోర్టుకు బిడ్డను దత్తత తీసుకున్న తల్లిదండ్రులతో కలిసి హాజరుకావాలి. బిడ్డకు జనన ధ్రువీకరణ పత్రం దత్తత తీసుకున్న జిల్లా మున్సిపల్ కార్యాలయం ద్వారా తల్లిదండ్రులకు అందజేస్తారు. దత్తత తీసుకున్న తర్వాత ఆరు నెలలకు ఒకసారి, రెండు సంవత్సరాల పాటు గృహ విచారణ సమయంలో రూ.2వేలు డీడీ రూపంలో ఏదైనా జాతీయ బ్యాంకు నుంచి పథక సంచాలకులు, జిల్లా మహిళ, శిశు అభివృద్ధి సంస్థ, కాకినాడ వారికి సమర్పించాలి.
- చట్ట విరుద్ధంగా పిల్లలను దత్తత తీసుకున్న వారికి మూడు నుంచి ఏడు సంవత్సరాల వరకు కఠిన కారాగార శిక్ష, రూ.లక్ష జరిమానా.... ఒక్కోసారి రెండూ విధించే అవకాశం ఉంది.



చిన్నారుల దత్తతపై అవగాహన కల్పిస్తూ ప్రచారం చేస్తున్న కాకినాడ జిల్లా ఐసీడీఎస్, బాలల పరిరక్షణ విభాగం అధికారులు


ఐసీడీఎస్ ఆధ్వర్యంలో కాకినాడ కరణం గారి సెంటర్లో నిర్వహిస్తున్న శిశుగృహ

కాకినాడ జిల్లాలో 2010 నుంచి ఇప్పటివరకు సుమారు 87 మంది చిన్నారులను దత్తత ఇచ్చినట్టు శిశుగృహ ఇన్‌చార్జి మేనేజరు లక్ష్మీరేవతి తెలిపారు. వీరిలో 14 మంది చిన్నారులను ఇతర దేశాల దంపతులకు దత్తత ఇచ్చినట్టు ఆమె 'ఆంధ్రజ్యోతి'కి చెప్పారు. ఇంకా నలుగురు చిన్నారులు శిశుగృహ మందిరంలో సంరక్షణ పొందుతున్నారు.

దత్తత కావాల్సి వస్తే...

దత్తతకు సంబంధించిన మరింత సమాచారం కావాలంటే దగ్గరలో ఉన్న అంగన్వాడీ కేంద్రాన్ని కానీ, ఐసీడీఎస్ అధికారులను కానీ, జిల్లా బాలల పరిరక్షణ విభాగం, రూమ్ నెం: 201, మోర్ సూపర్‌మార్కెట్‌పైన రెండో అంతస్తు, కరణంగారి సెంటర్, కాకినాడలో సంప్రదించవచ్చు. ప్రాజెక్టు డైరెక్టర్ మొబైల్: 8639140672, జిల్లా బాలల పరిరక్షణ అధికారి మొబైల్: 8555060818, శిశుగృహ మేనేజరు మొబైల్ :8919123488 సంప్రదించాలి.

డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా వాసులకు పిల్లల దత్తతకు సంబంధించిన సమాచారం కోసం సంప్రదించాల్సిన చిరునామా... స్పెషలైజ్డ్ అడాప్షన్ ఏజెన్సీ డోర్ నెం: 12-2-247/ ఎంబజీ 27, ఫ్లాట్ నంబర్ 01, ఏపీహెచ్‌బీ కాలనీ, ఎన్టీఆర్ విగ్రహం సమీపంలో, ఎర్రవంతెన దగ్గర, అమలాపురం. మొబైల్: 9640852688

తూర్పుగోదావరి జిల్లా వాసులకు పిల్లల దత్తతకు సంబంధించిన సమాచారం కోసం రాజమహేంద్రవరంలోని ఆర్డీవో ఆఫీసు ఎదురుగా ఉన్న శిశుగృహ మందిరంలో సంప్రదించవచ్చు. 8328544610 నెంబరుకు కాల్ చేసి వివరాలు తెలుసుకోవచ్చు. ప్రస్తుతం ఒక బాలుడు మాత్రమే దత్తతకు సిద్ధంగా ఉన్నాడు. దృష్టిలోపం సమస్యతో ఉన్న అతడికి త్వరలోనే ఆపరేషన్ చేయించి, ఆ తర్వాత దత్తత ప్రక్రియ చేపడతామని శిశుగృహ ఇన్‌చార్జి చెప్పారు.

వాడపల్లి వెంకన్న కార్తీకం ఆదాయం రూ.5.51 కోట్లు


ఆలయానికి పోటెత్తిన భక్తులు (ఫైల్)

ఆత్రేయపురం, నవంబరు 21 (ఆంధ్రజ్యోతి): వాడపల్లి వేంకటేశ్వరస్వామికి కార్తీక మాసం నెల రోజుల పాటు వివిధ రాష్ట్రాల నుంచి లక్షలాదిగా భక్తులు తరలివచ్చి దర్శించుకున్నారు. ఈ ఏడాది వివిధ సేవల ద్వారా రూ.5,51,55,734 ఆదాయం లభించినట్టు ఉప కమిషనర్ నల్లం సూర్యచక్రధరరావు తెలిపారు. గత ఏడాది రూ.4,75,63,429 ఆదాయం లభించగా, ఈ ఏడాది రూ.75,92,305 అధిక ఆదాయం వచ్చిందన్నారు. అలాగే భక్తుల సౌకర్యార్థం ఆలయంలో మెరుగైన ఏర్పాట్లు చేపడుతున్నామని చెప్పారు.

నవోదయ ప్రవేశ పరీక్షకు 7,170 మంది దరఖాస్తు

పెద్దాపురం, నవంబరు 21 (ఆంధ్రజ్యోతి): కాకినాడ జిల్లా పెద్దాపురంలోని జవహర్ నవోదయ విద్యాలయలో 2026-27 విద్యా సంవత్సరంలో 6వ తరగతి ప్రవేశానికిఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా నుంచి 7170 మంది విద్యార్థులు దరఖాస్తు చేసుకున్నట్టు ప్రిన్సిపాల్ సీతాలక్ష్మి శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. వచ్చేనెల 13న మొత్తం 32 కేంద్రాల్లో పరీక్ష నిర్వహిస్తామన్నారు. అభ్యర్థులు హాల్ టికెట్లను navodaya.gov.in, cbseitms.nic.in సైట్ ద్వారా డౌన్లోడ్ చేసుకోవలసి ఉంటుందని, హాల్ టికెట్ డౌన్లోడ్ చేసే సమయంలో అభ్యర్థి రిజిస్ట్రేషన్ నెంబర్‌ను యూజర్ ఐడీ గాను, అభ్యర్థి పుట్టిన తేదీని పాస్వర్డ్ గాను వినియోగించుకోవాలని ఆమె సూచించారు.

పులిహోరతో వేంకటేశ్వరస్వామి


పులిహోరతో తీర్చిదిద్దిన స్వామివారి రూపం

దవళేశ్వరం, నవంబరు 21 (ఆంధ్రజ్యోతి): స్థానిక శ్రీదేవి భూదేవి సమేత వెంకటేశ్వర స్వామి ఆలయంలో అన్నప్రసాద వితరణ సందర్భంగా శుక్రవారం పులిహోర, పువ్వులతో స్వామి రూపాన్ని రూపొందించారు. భక్తులు పెద్ద సంఖ్యలో దర్శించుకున్నారు.

భీమేశ్వరస్వామికి విశేష పూజలు

- ఝుతారఝూర అలంకరణలో భక్తులకు దర్శనమిచ్చిన స్వామివారు
- ఆకట్టుకున్న కోలాట ప్రదర్శనలు

సామర్లకోట, నవంబరు 21 (ఆంధ్రజ్యోతి): కాకినాడ జిల్లా సామర్లకోట కుమార రామ భీమేశ్వరస్వామి ఆలయంలో కార్తీకమాసం ముగింపును పురస్కరించుకుని శుక్రవారం సాయంత్రం పండితులు సోమేశ్వరశర్మ, చెరుకూరి సుందరరామయ్య (రాంబాబు), అంజిబాబు, రాజగోపాలశర్మ, వెంకన్న, వినయ్ విశేష పూజలు నిర్వహించారు. భీమేశ్వర స్వామికి వెండి ఝుతారఝూతం, బాలాత్రిపుర సుందరి అమ్మవారికి విశేష అలంకరణ చేయగా భక్తులు బారులు తీరి దర్శించుకున్నారు. తెల్లవారుజామున కోనేరు పుష్కరిణి, గోదావరి పుష్కరిణిల్లో అరటి డొప్పల్లో నేతి దీపాలు వదిలి కార్తీక మాసానికి ఘనంగా వీడ్కోలు పలికారు. ఆలయ ప్రాంగణాన్ని పుష్పాలతో సర్వాంగ సుందరంగా అలంకరించారు. ఎమ్మెల్యే నిమ్మకాయల చినరాజప్ప తనయుడు రంగనాగ్, టీడీపీ నేతలు స్వామి, అమ్మవార్లను దర్శించుకున్నారు. ధర్మకర్తల మండలి చైర్మన్ కంటే జగదీష్‌మోహన్ (బాబు), సభ్యులు చీమలకొండ ప్రసాద్, కొండపల్లి సత్య వాణి, కంచర్ల సుష్మామోహిని, గూనపాటి బుల్లెమ్మ భక్తులకు సేవలందించారు. సీఐ కృష్ణభగవాన్ ఆధ్వర్యంలో భారీ బందోబస్తు నిర్వహించారు. సామర్లకోటకు చెందిన మిరియాల కుటుంబీకుల వీరభద్రుని సంబరం, మహిళా భక్త సమాజంచే కోలాట ప్రదర్శన ఆకట్టుకున్నాయి.


వెండి ఝుటారఝూట అలంకరణలో కుమారరామ భీమేశ్వరస్వామి

ఫార్మా ఫ్యూజన్-2కే 25 ప్రారంభం

- జేఎన్‌టీయూకేలో నిర్వహణ
- జ్యోతి ప్రజ్వలన చేసిన వీసీ ప్రసాద్, ఓఎస్‌డీ ప్రొఫెసర్ కోటేశ్వరరావు, డైరెక్టర్ ఆఫ్ స్టూడెంట్ అఫైర్స్ ప్రొఫెసర్ కృష్ణమోహన్

జేఎన్‌టీయూకే (కాకినాడ), నవంబరు 21 (ఆంధ్రజ్యోతి): విద్యార్థుల్లో ఉన్న కొత్త ఆవిష్కరణలు, సృజనాత్మకతను వెలికితీసేందుకు వేదికగా ఫార్మా ఫ్యూజన్ 2 కే 25 నిలుస్తుందని జేఎన్‌టీయూకే వీసీ ప్రొఫెసర్ సీఎస్ఆర్‌కే ప్రసాద్ పేర్కొన్నారు. కాకినాడ జేఎన్‌టీయూ, స్కూల్ ఆఫ్ ఫార్మాస్యూటికల్ సైన్సెస్ అండ్ టెక్నాలజీస్-ఐఎస్‌టీ ఆధ్వర్యంలో రెండు రోజుల పాటు జరిగే ఫార్మా ఫ్యూజన్-2కే 25ను శుక్రవారం వీసీ ప్రసాద్, ఓఎస్‌డీ ప్రొఫెసర్ డి. కోటేశ్వరరావు, డైరెక్టర్ ఆఫ్ స్టూడెంట్ అఫైర్స్ ప్రొఫెసర్ వి.కృష్ణమోహన్‌తో కలసి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన విద్యార్థులను ఉద్దేశించి మాట్లాడుతూ ప్రతిభ, విజ్ఞానం, పరిశోధనాభావం, సృజనాత్మకతకు పదునుపెట్టే విధంగా వినూత్నంగా ఆలోచించి ముందుకు సాగాలని కోరారు. పలు అంశాలపై ప్రేరణాత్మక సందేశం ఇచ్చారు. మైసూర్ జేఎస్ఎస్ అకాడమీ ఆఫ్ హయ్యర్ ఎడ్యుకేషన్ అండ్ రీసెర్చ్ ప్రొ-ఛాన్సలర్, మాజీ ఫార్మసీ కౌన్సిల్ ఆఫ్ ఇండియా ప్రెసిడెంట్ డాక్టర్ బి.సురేష్ వర్చువల్‌గా పాల్గొని ఫార్మసీ రంగంలో కృత్రిమ మేధస్సు పాత్రపై విలువైన ప్రసంగం చేశారు. ఫార్మా పరిశోధన, ఔషధ ఆవిష్కరణ, క్లినికల్ డేటా విశ్లేషన, రోగి-కేంద్రీకృత ఆరోగ్య సంరక్షణలో కృత్రిమ మేధస్సు మార్గదర్శక మార్పులు తీసుకువస్తుందని వివరించారు. ఏయూ యూనివర్సిటీ ఫార్మాస్యూటికల్స్ సైన్సెస్ ప్రిన్సిపాల్ జి.గిరిజాశంకర్, డ్రగ్ కంట్రోల్ అడ్మినిస్ట్రేషన్ అసిస్టెంట్ డైరెక్టర్ డి. నాగమణి, ఐఎస్‌టీ డైరెక్టర్ ప్రొఫెసర్ బీటీ కృష్ణ, ఫార్మాస్యూటికల్ సైన్సెస్ విభాగాధిపతి ప్రొఫెసర్ బి.భవానీ పాల్గొని తగిన సూచనలు చేసి అనుభవాలను విద్యార్థులతో పంచుకున్నారు. ఈ సందర్భంగా పలువురు విద్యార్థులు వివిధ ఫార్మా, ఇన్నోవేటివ్ స్టాల్స్‌ని ప్రదర్శించి, అవగాహన కల్పించారు. కార్యక్రమంలో వివిధ కాలేజీలకు చెందిన సుమారు 500 మంది విద్యార్థులు పాల్గొన్నారు.

రెండో రోజైన శనివారం లైఫ్ ట్రాన్స్‌ఫార్మింగ్ ఎడ్యుకేషన్ నిపుణుడు డాక్టర్ వై.మోహన్‌రావుతో పాటు పలువురు ప్రముఖులు పాల్గొని విద్యా ర్థులతో తమ అనుభవాలను పంచుకుంటార న్నారు. ప్రదర్శించిన పలు అంశాలను పరిశీలిస్తారని కార్యక్రమ నిర్వాహకులు చెప్పారు.


జ్యోతిప్రజ్వలన చేస్తున్న అతిథులు

రాష్ట్రస్థాయి కబడ్డీ పోటీలకు నిఖిల్ ఎంపిక

దివాన్‌చెరువు, నవంబరు 21 (ఆంధ్రజ్యోతి): తమ పాఠశాలలోని 9వ తరగతి విద్యార్థి కోట నిఖిల్ రాష్ట్రస్థాయి కబడ్డీ పోటీలకు ఎంపికైనట్టు రాజానగరం మండలం పాతతుంగపాడు జడ్పీ ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయుడు బీఆర్ కమలదాస్ శుక్రవారం తెలిపారు. పాఠశాల వ్యాయామోపాధ్యాయుడు పార్థసారధి మాట్లాడుతూ కాకినాడలో ఇటీవల జరిగిన జిల్లా స్థాయి ఎస్‌జీఎఫ్ కబడ్డీ పోటీల్లో నిఖిల్ పాల్గొని ప్రతిభ కనబరిచాడన్నారు. విజయం సాధించి రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికయ్యాడన్నారు.. ఈ నెల 23వ తేదీ వరకు కర్నూలులో జరిగే రాష్ట్ర స్థాయి పోటీల్లో పాల్గొనేందుకు వెళ్లాడన్నారు. ఈ సందర్భంగా విద్యార్థిని హెచ్ఎంతో పాటు ఉపాధ్యాయులు అభినందించారు.


ఎంపికైన నిఖిల్‌తో పాతతుంగపాడు ఉన్నత పాఠశాల హెచ్ఎం, తదితరులు

యువతకు జర్మనీలో ఉద్యోగావకాశాలు

కార్పొరేషన్ (కాకినాడ), నవంబరు 21 (ఆంధ్రజ్యోతి): నైపుణ్యం కలిగిన యువకులకు జర్మనీలో ఉద్యోగావకాశాలు కల్పిస్తున్నట్టు కాకినాడ జిల్లా నైపుణ్యాభివృద్ధి అధికారి ఎస్. గోపీకృష్ణ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. కార్పెంటర్లు, స్టీల్ ఫిక్సర్లు, పేవింగ్ స్టోన్ వర్కర్స్, రోడ్డు వర్కర్ వంటి వృత్తుల్లో నైపుణ్యం ఉన్నవారికి ఉపాధి కల్పించేందుకు ఏపీ స్టేట్ స్కిల్ డెవలప్మెంట్ కార్పొరేషన్ ఆధ్వర్యంలో ఈ ఉద్యోగ అవకాశాలు కల్పించనున్నట్టు చెప్పారు. పదవ తరగతి లేదా ఇంటర్మీడియట్ అర్హతతో పాటు కనీసం రెండు సంవత్సరాల అనుభవం ఉండాలని, గరిష్ట వయస్సు 44 సంవత్సరాలు మాత్రమేనని చెప్పారు. జర్మనీలో నెలకు సుమారు రూ.2.57 లక్షల జీతంలో ఎనిమిది నెలల కాంట్రాక్ట్ పై నియామకాలు జరగనున్నాయి. వసతి, వీసా, ఫ్లైట్ చార్జీలు, హెల్త్ ఇన్సూరెన్స్ వంటి సదుపాయాలు ఎంప్లాయర్ భర్తిస్తారని పేర్కొన్నారు. అయితే భోజనం, ట్రాన్స్‌పోర్టేషన్ ఖర్చులు అభ్యర్థులే చూసుకోవాల్సి ఉంటుందని తెలిపారు. అభ్యర్థులు చెల్లించవలసిన ప్రాసెసింగ్ ఫీజు రూ.2 లక్షలు, జీఎస్టీ కలిపి, రెండు విడతల్లో చెల్లించాల్సి ఉంటుందని వివరించారు. పాస్ పోర్ట్, రిలీవింగ్ లెటర్, విద్యా సర్టిఫికెట్లు తప్పనిసరి అని సూచించారు. ఈనెల 26 లోపు దరఖాస్తు చేసుకోవాలని తెలిపారు. అలాగే https: //naipunyam. ap.gov.in/user-registration? page=program-registration నమోదు చేసుకోవచ్చని తెలిపారు. మరిన్ని వివరాలకు 9988853335, 9966291339, 8500885866 ఫోన్ నెంబర్లను సంప్రదించవచ్చని గోపీకృష్ణ సూచించారు.

రేపు అనపర్తిలో మెగా జాబ్‌మేళా

- వికాస ప్రాజెక్టు డైరెక్టర్ లచ్చారావు

కలెక్టరేట్ (కాకినాడ), నవంబరు 21 (ఆంధ్రజ్యోతి): తూర్పుగోదావరి జిల్లా అనపర్తిలో ఆదివారం మెగా జాబ్‌మేళా నిర్వహిస్తున్నట్టు వికాస ప్రాజెక్టు డైరెక్టర్ లచ్చారావు శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. అనపర్తి ఎమ్మెల్యే నల్లమిల్లి రామకృష్ణారెడ్డి పాల్గొంటారన్నారు. ఈ నెల 29న కాకినాడ జిల్లా ప్రత్తిపాడులో ఎమ్మెల్యే వరుపుల సత్యప్రభ ఆధ్వర్యంలో జాబ్‌మేళా జరుగుతుందన్నారు. గత పది రోజులుగా నిర్వహించిన జాబ్‌మేళాల్లో 250 మంది ఉద్యోగాలకు ఎంపికయ్యారన్నారు. వీరికి తమిళనాడు ఓసూర్‌లో ఉన్న టాటా ఎలక్ట్రానిక్స్ కంపెనీలో ఉద్యోగాలు లభించాయన్నారు. నెలకు రూ.19 వేలు జీతంతో పాటు వసతి, భోజనం సౌకర్యాలను టాటా సంస్థ కల్పించిందన్నారు.

పంచాయతీరాజ్ శాఖలో ఉద్యోగోన్నతులు

- డిప్యూటీ ఎంపీడీవోలు, గ్రామ సచివాలయాల అధికారులుగా పంచాయతీ కార్యదర్శుల నియామకం... ఉత్తర్వులు జారీ

సామర్లకోట, నవంబరు 21 (ఆంధ్రజ్యోతి): పంచాయతీరాజ్ శాఖలో పదోన్నతుల జాతర ప్రారంభమైంది. ఇటీవల డిప్యూటీ ఎంపీడీవోలకు ఎంపీడీవోలుగా పదోన్నతులు లభించింది. తాజాగా ప్రభుత్వం సీనియర్ సహాయకులకు, గ్రేడ్-1 పంచాయతీ కార్యదర్శులకు డిప్యూటీ ఎంపీడీవోలుగానూ, గ్రామ సచివాలయాల అధికారులుగాను పదోన్నతులు కల్పించింది. జోన్-2 పరిధిలోని 159 మంది తూర్పు గోదావరి, పశ్చిమగోదావరి, కోనసీమ అంబేడ్కర్ జిల్లా, ఏఎస్ఆర్ జిల్లాలకు చెంది పంచాయతీలలో గ్రేడ్-1 కార్యదర్శులుగా పనిచేస్తున్న వారికి పదోన్నతులు కల్పించింది. వీరిలో కొందరిని కాకినాడ జిల్లాకు కేటాయించగా మరి కొందరిని తూర్పుగోదావరి, పశ్చిమగోదావరి, ఏలూరు, ఏఎస్ఆర్ జిల్లాలకు కేటాయిస్తూ రాష్ట్ర ప్రభుత్వ కార్యదర్శి, సీనియర్ ఐఏఎస్ అధికారి కాటంనేని భాస్కర్ ఉత్తర్వులు జారీ చేసారు. వీరు ఆయా మండలాల పరిధిలో గ్రామ సచివాలయాల ప్రత్యేక అధికారులుగా నియామకం కానున్నారు. జీఎస్‌డబ్ల్యుఎస్ అధికారులుగా 3టైర్ విధానంలో రాష్ట్ర వ్యాప్తంగా 660 మందికి పదోన్నతులు లభించగా జోన్-2 పరిధిలో 159 మందికి పదోన్నతులు లభించాయి. సామర్లకోట మండలంలో పంచాయతీ కార్యదర్శిగా పనిచేస్తున్న కొర్ల బుల్లియ్యకాపును ఏఎస్ఆర్ జిల్లా గ్రామ సచివాలయ అధికారిగా పదోన్నతి పొందారు. అలాగే వీకెరాయపురం పంచాయతీ కార్యదర్శిగా పనిచేస్తున్న వై. శ్రీహరిని కాకినాడ జిల్లాలోనే గ్రామ సచివాలయ అధికారిగా పదోన్నతి పొందారు. అలాగే కాకినాడ జిల్లాకు వీజేవీ రమణ, ఎన్.శ్రీనివాసులు, సీహెచ్ వెంకటేశ్వరరావు, తూర్పుగోదావరి నుంచి కాకినాడ జిల్లాకు కెవీఎం. నారాయణరావు, పీహెచ్ ఎస్ఎస్ఎన్. రాజు, కెవీఎం.నారాయణరావు, కె. శ్రీనివాసు, జీ. ఉషారాణి, బొర్రు శిరీష, జలాల్ మహ్మద్, ఎండీవీ.రమణారెడ్డి, కర్రి శ్రీనివాసరావు, పినిశెట్టి వీరభద్రరావు, సావలం చినవెం కమ్మ, సీహెచ్ బాలబ్రహ్మాజీ, డి.శశికుమార్, సామర్లకోట ఈటీసీలో పనిచేస్తున్న తుమ్మల ఎల్ఎన్ కుమార్‌రాజా, సత్తి శ్రీనివాస రెడ్డి తదితరులు పదోన్నతులు పొందిన వారిలో ఉన్నారు.

శివోహం

కార్తీకమాసం ముగిసింది. నెలంతా ఆలయాల్లో భక్తిశ్రద్ధలతో పూజలు ఆచరించిన భక్తులు చివరిరోజు అంతే భక్తిని కనబరిచారు. దీంతో శైవక్షేత్రాలన్నీ శివనామస్మరణతో మార్మోగాయి. శుక్రవారం పోలిస్వర్గం(పోలిపాడ్యమి) సందర్భంగా శివోహం అంటూ ఆవు నెయ్యితో అరటిదొప్పల్లో వెలిగించిన దీపాలను గోదావరి, చెరువులు, కాలువలు, కోనేరుల్లో వదిలారు.





రాజమహేంద్రవరం పుష్కర్‌ఘాట్‌లో సూర్యుడికి నమస్కరిస్తున్న మహిళలు



పిఠాపురం పాదగయలో కుక్కుటేశ్వరస్వామికి అభిషేకాలు నిర్వహిస్తున్న అర్చకులు



రాజమహేంద్రవరం పుష్కర్‌ఘాట్‌లో దీపాలు వదులుతున్న భక్తులు



దీపాల వెలుగులో పిఠాపురం పాదగయ పుష్కరిణి



పుష్కర్‌ఘాట్‌లో భక్తితో నమస్కరిస్తున్న బాలుడు..





సాదాసీదాగా జడ్పీ స్థాయి సంఘాల సమావేశం



సమావేశంలో మాట్లాడుతున్న జడ్పీ చైర్మన్ వేణుగోపాలరావు

కాకినాడ సిటీ, నవంబరు 21 (ఆంధ్రజ్యోతి): ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా ప్రజా పరిషత్ స్థాయి సంఘాల సమావేశం సాదాసీదాగా సాగింది. కాకినాడ జిల్లా పరిషత్ కార్యాలయంలోని సమావేశ హాలులో శుక్రవారం 1,2,4,7 స్థాయి సంఘాల సమావేశాలు జడ్పీ చైర్మన్ విప్పర్తి వేణుగోపాలరావు అధ్యక్షతన జరిగాయి. వైస్ చైర్మన్ బుర్రా అనుబాబు అధ్యక్షతన 3వ స్థాయి సంఘ సమావేశం, వైస్ చైర్‌పర్సన్ మేరుగు పద్మలత అధ్యక్షతన 6వస్థాయి సంఘ సమావేశం, జడ్పీటీసీ రొంగల పద్మావతి అధ్యక్షతన 5వస్థాయి సంఘ సమావేశం జరిగాయి. అనపర్తి ఎమ్మెల్యే నల్లమిల్లి రామకృష్ణారెడ్డి, కాకినాడ రూరల్ ఎమ్మెల్యే పంతం నానాజీ, రాజానగరం ఎమ్మెల్యే బత్తుల బలరామకృష్ణ, ఇతర జిల్లా అధికారులు పాల్గొన్నారు. ముందుగా జడ్పీ చైర్మన్ వేణుగోపాలరావు ఉమ్మడి జిల్లాలో వివిధ అభివృద్ధి పథకాలపై సమీక్షించారు. అనపర్తి ఎమ్మెల్యే మాట్లాడుతూ అనపర్తిలో తాగునీటి సౌకర్యం కల్పించేందుకు జిల్లా పరిషత్‌కు చెందిన కొంతస్థలం కేటాయిస్తే తాగునీటి ప్రాజెక్టు కల్పించగమని, అందువల్ల వాటర్ గ్రిడ్‌లకు ఎకరం స్థలం కేటాయించాలని కోరారు. కాకినాడ రూరల్ ఎమ్మెల్యే మాట్లాడుతూ అచ్చంపేట సెంటర్ నుంచి సర్పవరం మీదుగా ఉప్పుటేరు వరకు ఆక్రమణలకు గురైన పంట కాలువను పునరుద్ధరిస్తే కాకినాడను ముంపు బారి నుంచి కాపాడవచ్చన్నారు. రాజానగరం ఎమ్మెల్యే నియోజకవర్గంలోని సమస్యలను ప్రస్తావించారు. ఆయాస్థాయి సంఘాల సమావేశాల్లో ఆర్థిక, ప్రణాళిక, గ్రామీణాభివృద్ధి, రహదారులు, విద్య, వైద్యం, గ్రామీణ నీటి సరఫరా, పారిశుధ్యం, జాతీయ ఉపాధి హామీ పథకం, హౌసింగ్, విద్యుత్, గ్రామీణ అభివృద్ధి అంశాలపై ఇప్పటి వరకు జరిగిన పురోగతి, కొత్తగా ప్రతిపాదించిన పనుల వివరాలపై సభ్యులు చర్చించారు. సమావేశంలో జడ్పీ సీఈవో వీవీఎస్ లక్ష్మణరావు, డిప్యూటీ సీఈవో జీఎస్ రాంగోపాల్, ఆయా జిల్లాల వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

హోరాహోరీగా..

గోగన్నమఠంలో పడవ పోటీలు

ఉత్సాహంగా పాల్గొన్న మత్స్యకార యువకులు

మామిడికుదురు, నవంబరు 21 (ఆంధ్రజ్యోతి): ప్రపంచ మత్స్యకార దినోత్సవాన్ని పురస్కరించుకుని డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా మామిడికుదురు మండలం గోగన్నమఠం గ్రామంలో నిర్వహించిన పడవ పోటీలు హోరాహోరీగా జరిగాయి. సుమారు 80కు పైగా పడవలు పాల్గొన్నాయి. అగ్నికుల క్షత్రియ సంఘం ఆధ్వర్యంలో ఏర్పాటుచేసిన ఈ పోటీల్లో మత్స్యకార యువకులు, పెద్దలు రెట్టించిన ఉత్సాహంతో పాల్గొన్నారు. గోగన్నమఠం రేవు నుంచి పాశర్లపూడిలంకలోని రెబ్బనపల్లి రేవు వరకు నాలుగు కిలోమీటర్లు మేర నిర్వహించిన ఈ పోటీలను తిలకించడానికి స్థానికులు భారీగా తరలివచ్చారు. మొదటిస్థానంలో పెసంగి భైరవస్వామి (రూ.5వేలు), ద్వితీయస్థానంలో కాటాడి మీరా సాహెబ్(రూ.3వేలు), తృతీయ స్థానంలో కాటాడి సత్యనారాయణ (రూ.2వేలు) నిలిచి బహుమతులుగా గెలుచుకున్నారు. ఈ పోటీలను చింతా శ్రీనివాస్, అర్థాని శ్రీనివాస్ నిర్వహించారు. కార్యక్రమంలో పట్టా నరసింహమూర్తి, జె.సత్యనారాయణ, పి.వెర్రియ్య తదితరులు పాల్గొన్నారు.



గోగన్నమఠం వైనతేయ నదిలో వెళ్తున్న పడవలు



విజేతలకు బహుమతులు అందజేస్తున్న నిర్వాహకులు

త్రుటిలో తప్పిన పెను ప్రమాదం

కేశవరం రైల్వే గేటు వద్ద ట్రాక్‌పై వాహనదారులు

గమనించి రత్నాచల్ ఎక్స్‌ప్రెస్ రైలును ఆపివేసిన లోకోపైలెట్



కేశవరంలో రైల్వేట్రాక్‌పై నిలిచిపోయిన రత్నాచల్ రైలు, వాహనదారులు

మండపేట, నవంబరు 21 (ఆంధ్రజ్యోతి): డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా మండపేట మండలం కేశవరం రైల్వే గేటు వద్ద త్రుటిలో పెను ప్రమాదం తప్పింది. అసలు ఏం జరిగిందంటే... విజయవాడ నుంచి విశాఖ వైపు వెళ్తున్న రత్నాచల్ ఎక్స్‌ప్రెస్ రైలు శుక్రవారం ఉదయం 9 గంటలకు కేశవరం రైల్వే గేటు వద్దకు చేరుకుంటుండగా రైల్వే గేటు వేసి ఉన్నప్పటికీ ట్రాఫిక్ రద్దీ కారణంగా పలువురు వాహనదారులు ట్రాక్ మధ్యలో ఉండిపోయారు. ఆ సమయంలో ప్రజలను గమనించిన లోకోపైలెట్ రైలును 5 నిమిషాల పాటు నిలుపుదల చేశాడు. గేటుకు అర కిలోమీటరు ముందే నిలుపుదల చేసి పెను ప్రమాదం జరగకుండా కాపాడాడు. ఒకవేళ గమనించపోతే ప్రమాదం జరిగి చాలా మంది ప్రాణాలు కోల్పోవల్సి వచ్చేది. దీంతో లోకో పైలెట్‌ను ప్రజలు అభినందించారు. ట్రాఫిక్ క్లియర్ అయిన తర్వాత రత్నాచల్ ఎక్స్‌ప్రెస్ విశాఖకు బయలుదేరింది.

పోలీస్ జాగిలం అర్జున్ మృతి

కాకినాడ ఎస్పీ తీవ్ర దిగ్భ్రాంతి



అర్జున్‌కు సెల్యూట్ చేస్తున్న కాకినాడ ఎస్పీ

కాకినాడ క్రైం, నవంబరు 21 (ఆంధ్రజ్యోతి): పోలీస్ జాగిలం (స్నిఫర్ డాగ్) అర్జున్ శుక్రవారం అనారోగ్యంతో మృతి చెందింది. అర్జున్ మృతి పట్ల కాకినాడ జిల్లా ఎస్పీ జి.బిందుమాధవ్ తీవ్ర దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. అర్జున్‌కు ఘన నివాళులర్పించారు. ఎస్పీ మాట్లాడుతూ జిల్లా పోలీస్‌శాఖకు అర్జున్ 13 ఏళ్ల పాటు నిబద్ధతతో సేవలందించిందన్నారు. గతేడాది మే 17న ఉద్యోగ విరమణ పొందిందని, అయినా ఇంకా సేవలందిస్తోందన్నారు. యూనిట్‌లో పనిచేసిన కాలమంతా అత్యున్నత నిబద్ధత, అలర్ట్‌నెస్, క్రమశిక్షణ ప్రదర్శించిందన్నారు. వివిధ ఆపరేషన్లు, శోధనా కార్యక్రమాల్లో, ప్రమాద నివారణా విధుల్లో సమర్థవంతంగా పనిచేసిందన్నారు. తన స్నిఫింగ్ సామర్థ్యంతో యూనిట్ కార్యకలాపాలకు ముఖ్యమైన సహకారం అందించందని, అర్జున్ మరణం జిల్లా పోలీస్‌శాఖకు తీరని లోటని తెలిపారు.

టీచర్ దుర్మరణం



జ్యోత్స్నభాయి (ఫైల్)

తుని రూరల్, నవంబరు 21 (ఆంధ్రజ్యోతి): కాకినాడ జిల్లా తుని బ్యాంక్ కాలనీకి చెందిన ఉపాధ్యాయురాలు జ్యోత్స్నభాయి (47) దుర్మరణం చెందారు. విశాఖ జిల్లా పాయకరావుపేట నియోజకవర్గం రాజానగరం లో ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో ఆమె పని చేస్తున్నారు. స్కూల్ ఆవరణలో బిల్డింగ్ పనులు జరుగుతుండగా స్లాబ్ వేసే క్రమంలో కాంక్రీట్ మోసుకెళ్లే ఐరన్ బక్కెట్ తెగి ఉపాధ్యాయురాలిపై పడడంతో అక్కడికక్కడే మృతిచెందారు. ఆమెకు భర్త రెండేళ్ళ క్రితమే గుండెపోటుతో మృతిచెందాడు. భర్త మరణం అనంతరం అత్తగారు, పిల్లలతో కలిసి తుని బ్యాంక్ కాలనీలో ఉంటున్నారు.

బాలికను మోసం చేసిన వ్యక్తికి కమ్యూనిటీ సర్వీస్ శిక్ష

కిర్లంపూడి, నవంబరు 21 (ఆంధ్రజ్యోతి): బాలికను ప్రేమిస్తున్నానని మోసం చేసిన వ్యక్తికి ఏడాదిపాటు రోజూ 2 గంటలు కమ్యూనిటీ సర్వీస్ శిక్ష విధించినట్లు జగ్గంపేట సీఐ శ్రీనివాస్ తెలిపారు. కాకినాడ జిల్లా కిర్లంపూడి మండలం వేలంకకు చెందిన బాలికను అదే గ్రామానికి చెందిన వ్యక్తి ప్రేమ పేరుతో మోసం చేశాడు. 2022లో కేసు నమోదు చేసిన కిర్లంపూడి పోలీసులు దర్యాప్తు చేసి చార్జిషీట్ కోర్టులో సమర్పించారు. శుక్రవారం రాజమండ్రి జువెనైల్ జస్టిస్ బోర్డు నిందితుడికి సంవత్సరం పాటు రోజూ 2 గంటలు కమ్యూనిటీ సర్వీస్ విధించాలని, బాలికకు రూ.2లక్షలు పరిహారం అందజేయాలని తీర్పు ఇచ్చారు.

జాతీయస్థాయి అథ్లెటిక్ పోటీలకు పుల్లేటికుర్రు విద్యార్థి



హర్షవర్ధని

అంబాజీపేట, నవంబరు 21 (ఆంధ్రజ్యోతి): జాతీయ స్థాయి అథ్లెటిక్ పోటీలకు డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా అంబాజీపేట మండలం పుల్లేటికుర్రు జిల్లా పరిషత్ హైస్కూల్‌కు చెందిన 9వ తరగతి విద్యార్థి చీకిరమిల్లి హర్షవర్ధని ఎంపికైనట్టు ఇన్‌చార్జి హెచ్‌ఎం బీర ధర్మరాజు తెలిపారు. స్కూల్ గేమ్స్ ఫెడరేషన్‌లో భాగంగా ఏలూరు జిల్లాలో జరిగిన రాష్ట్రస్థాయి అండర్ -19 రన్నింగ్ పోటీల్లో హర్షవర్ధని 1500 మీటర్ల రన్నింగ్ విభాగంలో బంగారు పతకం సాధించి జాతీయస్థాయి పోటీలకు ఎంపికైనట్టు పీడీలు అందె సూర్యనారాయణ, డి.ఉదయభాస్కర్ తెలిపారు. ఈనెల 26 నుంచి హర్యానాలో జరిగే జాతీయస్థాయి పోటీల్లో పాల్గొంటుందన్నారు. సర్పంచ్ జల్లి బాలరాజు, ఎస్‌ఎంసీ చైర్మన్ నూకల రత్నమాల, ఎంపీటీసీలు పబ్బినీడి రాంబాబు, కుసుమ వెంకటేష్, వడలి కృష్ణమూర్తి, టీచర్లు అభినందించారు.

ముఖ్య గమనిక.. ఇళ్లకు రావద్దు!

- మారేడుమిల్లి అడవుల్లో ఎన్‌కౌంటర్ల నేపథ్యంలో సురక్షిత ప్రాంతాల్లోనే ఉండాలని ప్రజాప్రతినిధులకు పోలీసుల ఆంక్షలు
- మన్యంలోకి రాకుండా అధికార పార్టీ ముఖ్య నేతలకు సూచనలు
- రేపు పెద్ద ఎత్తున నిరసనకు సిద్ధమైన మావోయిస్టులు
- ప్రతీకార చర్యలకు ఆస్కారం లేకుండా పెరిగిన పోలీస్ పహారా

రంపచోడవరం, నవంబరు 21 (ఆంధ్రజ్యోతి): అల్లూరి జిల్లా మారేడుమిల్లి అడవుల్లో జరిగిన రెండు ఎన్‌కౌంటర్లలో హిడ్మా, టెక్ శంకర్ వంటి కీలక నేతలతో పాటు 13 మంది మావోయిస్టులు మృతిచెందిన నేపథ్యంలో అల్లూరి జిల్లాలోని ప్రజా ప్రతినిధులకు మన్యంలో సంచరించకుండా పోలీసులు ముందు జాగ్రత్తగా ఆంక్షలు విధించారు. ఎమ్మెల్యేలు, ఎంపీలు, ఎమ్మెల్సీలు, ఇతర ముఖ్య హోదాల్లో ఉన్న నేతలెవరూ తమ నివాసాలకు రావొద్దని, మన్యానికి దూరంగా ఎక్కడైనా సురక్షిత ప్రాంతాల్లోనే ఉండిపోవాలని సూచించారు. అంతేకాకుండా వారి,వారి నివాసాల వద్ద నిఘాలను కూడా పెంచారు. వారు ఉండే ప్రాంతాల్లో పహారాను పెంచి భద్రత కల్పిస్తున్నారు. రంపచోడవరం ఎమ్మెల్యే మిరియాల శిరీషదేవి, ఎస్టీ కమిషన్ చైర్మన్ సోళ్ల బొజ్జిరెడ్డి, ఎమ్మెల్సీ అనంతబాబుకు ఇక్కడి పరిస్థితులను వివరించి ఈ మేరకు పోలీసుల తగు సూచనలను చేశారు. అంతేకాకుండా అధికార కూటమి పార్టీలకు చెందిన ముఖ్య నాయకలు, కీలక నేతలకు సైతం తగు హెచ్చరికలు చేసి సురక్షితంగా ఉండాలని పేర్కొన్నారు. ఈ రెండు ఎన్‌కౌంటర్ల నేపథ్యంలో మావోయిస్టులు ఇప్పటికే కీలక ప్రకటనలను చేసి ఈ ఎన్‌కౌంటర్లను ఖండించారు. ఇవి బూటకపు ఎన్‌కౌంటర్లని, నిరాయుధులుగా ఉన్నవారిని పట్టుకుని తీసుకువచ్చి పోలీసులు కాల్చేశారని ప్రకటనలు విడుదల చేసిన మావోయిస్టులు ఈనెల 23న పెద్ద ఎత్తున నిరసన చేపట్టనున్నారు. ఈ ఎన్‌కౌంటర్లపై వామపక్ష పార్టీలు కూడా తీవ్రస్థాయిలో ఆరోపణలు గుప్పించాయి. ఎదురవుతున్న వ్యతిరేకత, ఆందోళనల నేపథ్యంలో మావోయిస్టుల నుంచి ఏ ప్రతీకార చర్యలకు ఆస్కారం లేకుండా పోలీసులు ఎక్కడికక్కడ బందోబస్తు ఏర్పాట్లు చేస్తున్నారు.

వైద్యుల నిర్లక్ష్యంతో గర్భిణి మృతి


కాకినాడ జీజీహెచ్‌లో సంఘటన



మల్లేశ్వరీ (ఫైల్)

జీజీహెచ్ (కాకినాడ), నవంబరు 21 (ఆంధ్ర జ్యోతి): వైద్యుల నిర్లక్ష్యంతో 8వ నెల గర్భిణి మరణించిన సంఘటన కాకినాడ జీజీహెచ్‌లో జరిగింది. మృతురాలి వదిన ధనలక్ష్మి తెలిపిన వివరాల ప్రకారం.. కాకినాడ జిల్లా తాళ్లరేవు మండలం గాడిమొగ గ్రామానికి చెందిన పెసంగి మల్లేశ్వరి (31) ప్రస్తుతం 8వ నెల గర్భిణి. తన వదిన ఏఎన్‌ఎం అయిన ధనలక్ష్మి సహాయంతో ఈనెల 14న జనరల్ చెకప్ నిమిత్తం కాకినాడ జీజీహెచ్‌కు వచ్చింది. గైనిక్ వైద్యులు వైద్య పరీక్షలు నిర్వహించి అబ్జర్వేషన్‌లో ఉండాలని చెప్పడంతో యాంటీనేటల్ వార్డులో చేరింది. ఆసుపత్రిలో చేరే సమయంలో తనకు కొన్ని రకాల మందులు పడవని వైద్యులకు చెప్పగా ఆ సమాచారాన్ని కేస్‌షీట్‌లో పొందుపర్చారు. పడని మందుల్లో ప్యాంటో ప్రాజాల్ కూడా ఉంది. ఈ విధంగా చికిత్స జరుగుతున్న సమయంలో గురువారం మధ్యాహ్నం డాక్టర్ వచ్చి మల్లేశ్వరీకి ప్యాంటోప్రాజాల్ ఇంజక్షన్ ఇస్తుండగా అక్కడికి ధనలక్ష్మి చేరుకుని ఆ ఇంజక్షన్ పడదని అది ఇవ్వద్దని ప్రాధేయపడింది. కోపోద్రిక్తులైన డాక్టర్ బయటకు వెళ్లమంటూ ధనలక్ష్మిని తోసేశారు. అయితే ఇంజక్షన్ చేసిన కొద్ది సమయానికే మల్లేశ్వరీ అపస్మారక స్థితిలోకి వెళ్లిపోయింది. అనంతరం వైద్యులు మల్లేశ్వరీని జిఐసీయూకు తరలించారు. ఈ క్రమంలో 3 గంటలకు కడుపులో బిడ్డ చనిపోయిందంటూ మల్లేశ్వరీ కుటుంబీకులకు తెలిపారు. అనంతరం మల్లేశ్వరీ దేహంలో చలనం లేకపోయేసరికి వైద్యులు బీపీ చూడడం, సీపీఆర్ చేయడం చేశారు. ధనలక్ష్మి డాక్టర్‌ను అడిగే సరికి బాగానే ఉంది అంటూ రాత్రి 11.30 వరకు వైద్యం చేస్తున్నట్టే నమ్మించారు. అనంతరం మల్లేశ్వరి చనిపోయిందని చెప్పారు. అయితే ఇంజక్షన్ ఇవ్వడంతోనే మల్లేశ్వరీ చనిపోయిందని, వైద్యులు ముందే చంపేసి ఇప్పుడే చనిపోయిందంటూ తప్పును కప్పిపుచ్చుకుంటున్నారని మృతురాలి కుటుంబీకులు విలపించారు. మృతురాలి బంధువులను వైద్యులు భయభ్రాంతులకు గురిచేయడంతో మృతదేహాన్ని స్వస్థలానికి తరలించారు.

మోతుగూడెంలో గల్లంతైన యువకుడి మృతదేహం లభ్యం



మోతుగూడెం, నవంబరు 21 (ఆంధ్రజ్యోతి): అల్లూరి జిల్లా మోతుగూడెనికి విహారయాత్రకు వచ్చి ఈనెల 19న సాయంత్రం పుష్పబ్రిడ్జి వద్ద ఈతకు వెళ్లి నీటి ప్రవాహంలో కొట్టుకుపోయిన గనిశెట్టి జగదీశ్వరరావు (26) మృతదేహం శుక్రవారం లభ్యమైందని మోతుగూడెం ఎస్‌ఐ కె.సాధిక్ తెలిపారు. మృతదేహానికి పోస్టుమార్టం నిర్వహించి మృతుడి తండ్రికి అప్పగించారు. హెడ్ కానిస్టేబుల్ నిబంధన శ్రీను, సన్నీ, సుబ్బా రావు తదితరులు ఉన్నారు.

బాలబాలాజీ ఆదాయం రూ.72.88 లక్షలు

మామిడికుదురు, నవంబరు 21 (ఆంధ్రజ్యోతి): డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా మామిడికుదురు మండలం అప్పనపల్లి బాలబాలాజీ స్వామికి కార్తీకమాసం సందర్భంగా వివిధ ఆర్జిత సేవల ద్వారా రూ.72,88,637 ఆదాయంగా వచ్చిందని ఆలయ సహాయ కమిషనర్ ఎం.సత్యనారాయణరాజు తెలిపారు.

ట్రాక్టర్ కిందపడి డ్రైవర్ మృతి



శ్రీనివాస్ (ఫైల్)



ఘటనా స్థలంలో ట్రాక్టర్

రావులపాలెం, నవంబరు 21 (ఆంధ్రజ్యోతి): ట్రాక్టర్ డ్రైవింగ్‌పై జీవనం పొందుతున్న ఆ ట్రాక్టరే డ్రైవర్ పట్ల మృత్యువైంది. డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా రావులపాలెం మండలం ముమ్మిడివర్పాడుకు చెందిన అడపా శ్రీనివాస్(50) ట్రాక్టర్ డ్రైవర్‌గా పని చేస్తున్నాడు. ఈ నేపథ్యంలో శుక్రవారం గడ్డి లోడు వేసుకుని వచ్చేందుకు బయలుదేరి వెళ్లాడు. భోజన సమయం కావడంతో ముమ్మిడివర్పాడు నుంచి పల్లిపాలెం వెళ్లే రహదారిలో మెరక ప్రాంతంలో ట్రాక్టర్‌ను నిలుపుదల చేసి ఆ చెంతనే ఉన్న హోటల్‌కు భోజనానికి వెళ్లాడు. ఆ సమయంలో ట్రాక్టర్ మెరక మీద ఉన్న కారణంగా ముందుకు కదులుతుండడంతో పరుగున వెళ్లి ఆపే ప్రయత్నం చేసేందుకు అక్కడికి వెళ్లాడు. ఇంజన్ స్టార్ట్ అవ్వడంతో వేగంగా ముందుకు వెళ్లింది. స్టీరింగ్ పట్టుకుని పైకి ఎక్కే సమయంలో కాలు జారి కింద పడిపోవడంతో ట్రాక్టర్ ఇంజన్ టైరు ట్రక్కు టైర్లు అతడి మీద నుంచి వెళ్లిపోవడంతో అక్కడికక్కడే మృతిచెందాడు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం కొత్తపేట ఏరియా ఆసుపత్రికి ఎస్‌ఐ చంటి తరలించారు. కేసు నమోదు చేసినట్టు ఆయన చెప్పారు.

దింపు కార్మికుడు మృతి

కాట్రేనికోన, నవంబరు 21(ఆంధ్రజ్యోతి): డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా కాట్రేనికోన మండలం దొంతికుర్రులో శుక్రవారం దింపు కార్మికుడు కర్రి అప్పలరాజు మృతిచెందాడు. మెయిన్‌రోడ్డు పక్కన కొబ్బరిచెట్టు ఎక్కి దింపు తీస్తుండగా మేకు అదుపుతప్పి కిందపడ్డాడు. స్థానికులు 108కు సమాచారమిచ్చారు. అంబులెన్స్ వచ్చేసరికే అప్పలరాజు మృతిచెందినట్టు స్థానికులు తెలిపారు.పోలీసులు వివరాలు సేకరించారు.

నిత్యాన్నదాన ట్రస్టుకు విరాళం
అంతర్వేది, నవంబరు 21(ఆంధ్రజ్యోతి): అంతర్వేది పుణ్యక్షేత్రంలో శ్రీలక్ష్మీనరసింహస్వామి నిత్యాన్నదాన ట్రస్టుకు తెలంగాణ రాష్ట్రం వనస్థలిపురానికి చెందిన పొన్నపల్లి ఆదిత్యశంకర్-సాయిశ్రీపూర్ణ దంపతులు రూ.లక్ష విరాళంగా అందించారు. శుక్రవారం వారు స్వామివారిని దర్శించుకుని పూజల అనంతరం విరాళాన్ని అందజేశారు.

బీటీ రోడ్డు ప్రారంభోత్సవం
రాజోలు,నవంబరు21(ఆంధ్రజ్యోతి): శివకోటిలో జాతీయ రహదారి 216 నుంచి ఓఎన్జీసీ సైట్ మడ్ల గ్రూపు వరకు ఓఎన్జీసీ నిధులు రూ.90లక్షలతో నిర్మించిన బీటీ రోడ్డును ఎమ్మెల్యే దేవ వరప్రసాద్ శుక్రవారం ప్రారంభించి శిలాఫలకం ఆవిష్కరించారు. ఎంపీపీ కడలి శ్రీదుర్గ, చాగంటి స్వామి, డైరెక్టర్ బందెల పద్మ, సూరిశెట్టి శ్రీనివాస్ పాల్గొన్నారు.

కార్తీకానికి ఘన వీడ్కోలు


ముమ్మిడివరం: దీపాలు వదులుతున్న భక్తులు

మామిడికుదురు, నవంబరు21(ఆంధ్రజ్యోతి): నెల రోజులు ప్రత్యేక పూజలు చేసిన భక్తులు కార్తీకమాసానికి ఘన వీడ్కోలు పలికారు. మార్గశిర బహుళ పాడ్యమిని పురస్కరించుకుని శుక్రవారం పోలిస్వర్గ దీపోత్సవ కార్యక్రమాన్ని భక్తులు ఘనంగా చేశారు. వైనతేయ నదీలో పుణ్యస్నానాలు ఆచరించి కార్తీక దీపాలు వెలిగించి వాటికి ప్రత్యేక పూజలు నిర్వహించి దీపాలను నదిలో వదిలారు. భక్తులు తెల్లవారుజాము నుంచి నదీతీరాల్లోను, కాల్వల వద్ద దీపాలు వదిలారు. శివాలయాల్లో ప్రత్యేక పూజలు నిర్వహించి కార్తీకమాసానికి వీడ్కోలు పలికారు.

ముమ్మిడివరం, (ఆంధ్రజ్యోతి): నెలరోజుల పాటు ఆధ్యాత్మిక శోభతో సాగిన కార్తీకమాసం చివరి రోజైన శుక్రవారం ముమ్మిడివరంలోని బాలయోగి కాల్వ గట్టు భక్తులతో కిటకిటలాడింది. పోలిస్వర్గం పురస్కరించుకుని భక్తులు పెద్ద సంఖ్యలో తరలివచ్చి దీపాలు వెలిగించి అరటి డొప్పలతోకాల్వలో విడిచిపెట్టారు. కార్తీక అమావాస్యతో కార్తీకమాసం ముగిసిన చివరిరోజైన పోలి స్వర్గం పేరిట భక్తులు దీపాలను నీటిలో వదిలే సంప్రదాయాన్ని నిర్వహిస్తారు. ఆలయాలు దీప కాంతులతో వెలిగిపోతాయి. బాలయోగి కాల్వగట్టు వద్దనున్న సాయిబాబా, వినాయకుడు, ఆంజనేయస్వామి ఆలయాల్లో వేదపండితులు ప్రత్యేక అభిషేకాలు నిర్వహించారు. మహిళా భక్తులు వందల సంఖ్యలో పాల్గొని దీపాలు వదిలి కార్తీకమాసానికి వీడ్కోలు పలికారు.

అల్లవరం, (ఆంధ్రజ్యోతి): శ్రీరామునితో శివలింగ ప్రతిష్ఠతో పురాణ ప్రసిద్ధి పొందిన ఎన్.రామేశ్వరం పార్వతీ రామేశ్వరాలయం వద్ద అన్నసమారాధన కమిటీ ఆధ్వర్యంలో భారీ అన్నసమారాధన జరిగింది. పాడ్యమి దీపాల సందర్భంగా జరిగిన అన్నసమారాధనకు భక్తులు పోటెత్తారు. పార్వతీ రామేశ్వరునికి పుల్లేటికుర్తి ఫణి, ఉమాశంకర్ ఆధ్వర్యంలో అభిషేకాలు జరిగాయి, అధిక సంఖ్యలో భక్తులు పాడ్యమి సముద్ర స్నానాలు ఆచరించారు. ఆలయ చైర్మన్ అంగాని రామారావు ఆధ్వర్యంలో క్షత్రియ కార్పొరేషన్ డైరెక్టర్ దెందుకూరి సత్తిబాబురాజు, టీడీపీ గ్రామ అధ్యక్షుడు మంతెన సురేష్‌రాజు, తెలుగు యువత జిల్లా ఉపాధ్యక్షుడు పరసా కిరణ్, గుంటూరి రంగరాజు తదితరులను కండువాలు కప్పి సత్కరించారు. కొల్లు ఏడుకొండలు, చక్కా సుబ్బారావు, ఓలేటి సత్తిబాబు, చక్కా నరసింహమూర్తి తదితరులు పాల్గొన్నారు.

అంబాజీపేట, (ఆంధ్రజ్యోతి): కార్తీక మాసం ముగింపు పోలి పాడ్యమి సందర్భంగా పలు ఆలయాల్లో ప్రత్యేక పూజలు నిర్వహించారు. మండలంలోని శైవక్షేత్రాలు భక్తులతో కిటకిటలాడాయి. మహిళలు వేకువజామునే కౌశిక నదులు, గోదావరి తీరాలు, పంటకాలువల్లో దీపాలు వెలిగించి మొక్కులు తీర్చుకున్నారు. అనంతరం ఆలయాల్లో అర్చకులకు స్వయంపాకాలు అందించారు. మండలంలోని ఏకాదశ రుద్రుల ఆలయాలు భక్తులతో కిటకిటలాడాయి.

ప్రతీ ధాన్యం గింజను కొనుగోలు చేస్తాం

● ఎమ్మెల్యే గిడ్డి సత్యనారాయణ


గంగలకుర్రులో ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే సత్యనారాయణ

అంబాజీపేట, నవంబరు 21(ఆంధ్రజ్యోతి): రైతులు పండించిన ప్రతి ధాన్యం గింజను కొనుగోలు చేస్తామని ఎమ్మెల్యే గిడ్డి సత్యనారాయణ అన్నారు. గంగలకుర్రు సొసైటీ కార్యాలయం వద్ద చైర్మన్ అల్లాడ రవి ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ఆయన శుక్రవారం ప్రారంభించారు. రైతు సంక్షేమం కోసం ప్రభుత్వం వేగవంతమైన చర్యలు తీసుకుంటుందన్నారు. ధాన్యం విక్రయించిన ఐదు గంటల్లోపే చెల్లింపులు జరిగేలా చర్యలు తీసుకుంటున్నామన్నారు. తుఫాన్ హెచ్చరికల నేపథ్యంలో రైతులు కోతలు త్వరితగతిన పూర్తిచేసుకుని ధాన్యాన్ని ఒబ్బిడి చేసుకోవాలన్నారు. అనంతరం సొసైటీ భవనం శిథిలావస్థకు చేరిన విషయాన్ని సొసైటీ చైర్మన్ అల్లాడ రవి ఎమ్మెల్యే దృష్టికి తీసుకువచ్చారు.స్థానికంగా ఉన్న కమ్యూనిటీ భవనం అసంపూర్తిగా ఉండటంతో పనులు పూర్తి చేస్తామన్నారు. నీటిపారుదల శాఖ డైరెక్టర్ శిరిగినీడి వెంకటేశ్వరరావు, సర్పంచ్‌లు దొంగ నాగేశ్వరరావు, కాండ్రేగుల శ్రీనివాసరావు, ఎంపీటీసీ నెల్లి పండు, నాయకులు గుడాల ఫణి, దొమ్మేటి సాయికృష్ణ, వాసంశెట్టి కుమార్, షైపాల తాతాజీ, కొర్లపాటి గోపి, అడపా బాబ్జి, మట్టపర్తి రెడ్డమ్మ, జలంధర్, కొప్పినీడి ఈశ్వరరావు, సొసైటీసీఈవో జీఎస్ఎం శంకర్ పాల్గొన్నారు.

ప్రతి రైతుకు సాయం అందాలి:
మొంథా తుఫాన్‌తో నష్టపోయిన ప్రతి రైతుకు సాయం అందేలా చర్యలు తీసుకోవాలని వ్యవసాయాధికారి ధర్మప్రసాద్‌కు ఎమ్మెల్యే గిడ్డి సూచించారు. గంగలకుర్రు వచ్చిన ఎమ్మెల్యేకు రైతులు తమకు సాయం అందలేదని తెలపడంతో ఎమ్మెల్యే స్పందించారు. మీకు జీతాలు వస్తున్నాయి కదా... రైతుల బాధలను ఎందుకు పట్టించుకోవడంలేదని అక్కడున్న అధికారులపై ఆగ్రహం వ్యక్తం చేశారు. ప్రతి రైతుకు సాయం అందేలా చూడాలని ఎమ్మెల్యే ఆదేశించారు.

ఎస్పీకి పెట్రోల్ బంకుల యూనియన్ అభినందనలు


ఎస్పీని అభినందిస్తున్న తాతబాబు తదితరులు

అమలాపురం టౌన్, నవంబరు 21(ఆంధ్రజ్యోతి): యానాం నుంచి అక్రమంగా పెట్రోలు, డీజిల్‌లను దిగుమతిచేసి వ్యాపారాలు చేస్తున్న వారికి అడ్డుకట్ట వేసేవిధంగా ఎస్పీ రాహుల్‌మీనా చేస్తున్న కృషిని అభినందిస్తూ శుక్రవారం పెట్రోల్ బంకుల యూనియన్ నాయకులు జవ్వాది తాతబాబు తదితరులు కలుసుకుని ఎస్పీని ప్రత్యేకంగా అభినందించారు. ఫ్రెంచి యానాం నుంచి కొంతకాలంగా పెట్రోలు, డీజిల్ ఉపఉత్పత్తులను ఉభయ గోదావరి జిల్లాలకు తరలిస్తూ స్థానికంగా ఉన్న వ్యాపారులను అడ్డుకునే విధంగా ఎస్పీ తీసుకున్న చర్యలను తాతబాబు ప్రత్యేకంగా అభినందించారు. రెండు రోజుల క్రితం యానాం పక్కన ఉన్న ఐ.పోలవరం మండలం ఎదుర్లంక వద్ద వాహనాల తనిఖీలో భాగంగా అక్రమంగా తరలిస్తున్న డీజిల్ ట్యాంకరును సీజ్‌చేసి ముగ్గురు వ్యక్తులను అదుపులోకి తీసుకోవడం పట్ల యూనియన్ నాయకులు ఎస్పీకి అభినందనలు తెలిపారు. సీసీ కెమెరాల నిఘాను ప్రత్యేకంగా ఏర్పాటు చేయడంతో పాటు సిబ్బందిని నియమించినట్టు ఎస్పీ తెలిపారు. అనధికారికంగా చేసే పెట్రోల్, డీజిల్ వ్యాపారాలకు పూర్తిస్థాయిలో అడ్డుకట్ట వేయనున్నట్టు ఆయన తెలిపారు. ఎస్పీ రాహుల్‌మీనా బృందం చేసిన కృషిని అభినందిస్తూ తాతబాబు, దాసరి సాయిరత్నాకర్, రంబాల చిట్టిబాబు, విశ్వేశ్వరరావు, వెంకటరత్నం, సుధీర్‌రాజు తదితరులు ఎస్పీకి ప్రత్యేక అభినందనలు తెలిపారు.

గృహ రుణాలకు దరఖాస్తు చేసుకోండి: ఎమ్మెల్యే


హౌసింగ్ ఈఈతో చర్చిస్తున్న ఎమ్మెల్యే గిడ్డి

పి.గన్నవరం, నవంబరు 21(ఆంధ్రజ్యోతి): ప్రధానమంత్రి ఆవాస్ యోజన గ్రామీణ్ పథకం 2.0 ద్వారా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు మంజూరు చేయనున్న గృహ రుణాల కోసం అర్హులైన లబ్ధిదారులు దరఖాస్తు చేసుకోవాలని ఎమ్మెల్యే గిడ్డి సత్యనారాయణ కోరారు. పి.గన్నవరం జనసేన క్యాంపు కార్యాలయంలో శుక్రవారం హౌసింగ్ ఈఈ ఎం.చంద్రశేఖర్‌తో చర్చించిన అనంతరం ఆయన మాట్లాడారు. గ్రామ సచివాలయాల్లో ఇంజనీరింగ్ అసిస్టెంట్లు, సంక్షేమసహాయకులను సంప్రదించి రుణ కోసం దరఖాస్తు చేసుకోవాలన్నారు. అనంతరం సంబంధిత సిబ్బంది జియోటాగ్ ద్వారా లబ్ధిదారుని ఇంటి స్థలాన్ని, వ్యక్తిగత వివరాలను పరిశీలిస్తారని చెప్పారు. సొంత గృహం ఉన్నవారు, గతంలో ప్రభుత్వం ద్వారా గృహ నిర్మాణం కోసం రుణం పొందినవారు ఈ పథకానికి అనర్హులని చెప్పారు. అర్హులైన నిరుపేదలు ఈనెల30వ తేదీలోపు దరఖాస్తు చేసుకోవాలన్నారు. నియోజకవర్గంలో ఇప్పటి వరకు 2050మంది దరఖాస్తు చేసుకున్నారన్నారు. ఎమ్మెల్యేను కలిసిన వారిలో హౌసింగ్ డీఈ శ్రీనివాసరావు, సిబ్బంది ఉన్నారు.

రేపు యానానికి పుదుచ్చేరి కలెక్టర్
యానాం, నవంబరు 21(ఆంధ్రజ్యోతి): పుదుచ్చేరి కలెక్టర్ కులోంత్తగన్ రెండు రోజుల పర్యటనలో భాగంగా ఆదివారం యానాం రానున్నారు. ఓఎన్జీసీ పైపులైన్ లీకేజీ ఘటనకు సంబంధించి ప్రభుత్వ ఢిల్లీ ప్రత్యేక ప్రతినిధి మల్లాడి కృష్ణారావు, ఎమ్మెల్యే గొల్లపల్లి శ్రీనివాస్ అశోక్‌లు ఇచ్చిన వినతులు మేరకు పుదుచ్చేరి కలెక్టర్ యానాం వస్తున్నట్లు నాయకులు తెలిపారు. యానాంలో పర్యటన, కాకినాడ జిల్లా కలెక్టర్‌తో, ఓఎన్జీసీ అధికారులతో సమావేశం అవుతారని తెలిసింది.

'మానవ వికాసానికి బుద్ధుని బోధనలే శరణ్యం'
ముమ్మిడివరం, నవంబరు 21(ఆంధ్రజ్యోతి): మానవ నైతిక వికాసానికి బుద్ధుని బోధనలే శరణ్యమని బుద్ధిస్ట్ సొసైటీ ఆఫ్ ఇండియా(బీఎస్ఐ) జిల్లా శాఖ పేర్కొంది. నగర పంచాయతీ పరిధిలోని స్థానిక బుద్ధ పార్కు ఆవరణలో శుక్రవారం బీఎస్ఐ మండలశాఖ అధ్యక్షుడు సింహాద్రివర్మ అధ్యక్షతన సమావేశం జరిగింది. ముఖ్యఅతిథిగా హాజరైన అధ్యక్షుడు కేవీవీ సత్యనారాయణ మాట్లాడుతూ సమాజంలో మానవతా విలువలతో పాటు జ్ఞానతృష్ణ సాధనకు బౌద్ధం ఎంతో దోహదం చేస్తుందన్నారు. మరో అతిథి జిల్లా కార్యదర్శి బుడితి బాబురాజేంద్రప్రసాద్ మాట్లాడుతూ ఈనెల23న మండలంలో జరగనున్న బౌద్ధ దమ్మ ప్రచార యాత్రను బౌద్ధులు, అంబేడ్కరీయులు అధిక సంఖ్యలో పాల్గొని జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు. సీనియర్ ఉపాసకులు మట్టా వెంకట్రావు, కవి, దత్తు, కాశిబాబుజగ్జీవన్‌రావు, డి.ఆంజనేయులు, వడ్డి నాగేశ్వరరావు, అప్పారావు పాల్గొన్నారు.

అమలాపురం మహిళా వాకర్స్ క్లబ్‌కు అవార్డుల పంట
అమలాపురంటౌన్, నవంబరు21(ఆంధ్రజ్యోతి): అమలాపురం మహిళా వాకర్స్‌క్లబ్ రజతోత్సవాన్ని నిర్వహించుకోవడంతో పాటు జిల్లాలోనే ఉత్తమ క్లబ్‌గా ప్రత్యేక గుర్తింపు పొందింది. ఈఏడాది క్లబ్ తరపున శాశ్వత ప్రాజెక్టుగా అమలాపురం హరిమనో వికాస కేంద్రానికి రెండు ఇన్వర్టర్లు అందించి ప్రత్యేక అవార్డును దక్కించుకుంది. అమలాపురం గోఖలే వీధిలో శుక్రవారం జరిగిన సమావేశంలో గవర్నర్ సప్పా నాగేశ్వ రరావు, ఏరియా కోఆర్డినేటర్ తేతల సత్యనారాయణరెడ్డి ముఖ్యఅతిథులుగా హాజరై పలువిభాగాల్లో అవార్డులు అందుకున్న మహిళా ప్రతినిధులను ప్రత్యేకంగా అభినందించి సత్కరించారు. క్లబ్ అధ్యక్షురాలు యర్రమిల్లి అనంతలక్ష్మి, కార్యదర్శి గోటేటి లక్ష్మి, కోశాధికారి కంకటాల విజయలక్ష్మి, పోలిశెట్టి అనంతలక్ష్మీదేవి, పేరి లలిత, పచ్చిగోళ్ల సత్యకుమారి, యర్రమిల్లి రామతులసి, పుత్సా రాజేశ్వరి, బులిటెన్ ఎడిటర్ పుత్సా కృష్ణకామేశ్వర్ పాల్గొన్నారు.

నగరం గెయిల్ వద్ద ఆపరేషన్ డ్రాగన్


నగరంలోని గెయిల్ కార్యాలయంలోకి చొచ్చుకు వెళుతున్న ఉగ్రవాదులు

ఆక్టోపస్ ఆధ్వర్యంలో మాక్ డ్రిల్


ఉగ్రవాదులను మట్టుబెట్టడానికి కార్యాలయంలోకి వెళ్తున్న ఆక్టోపస్ దళాలు

మామిడికుదురు, నవంబరు 21(ఆంధ్రజ్యోతి): నగరంలోని గెయిల్ వద్ద ఆక్టోపస్ ఆధ్వర్యంలో ఆపరేషన్ డ్రాగన్ పేరిట శుక్రవారం మాక్‌డ్రిల్ నిర్వహించారు. అత్యవసర పరిస్థితుల్లో ఉగ్రవాదులు కార్యాలయాల్లో చొరబడితే ఆక్టోపస్ దళాలు ఏవిధంగా వారిని అదుపు చేస్తారో కళ్లకు కట్టినట్టు చేసి చూపించారు. శుక్రవారం సుమారు 5గంటల సమయంలో ఐదుమంది ఉగ్రవాదులు ఆయుధాలతో గెయిల్ కార్యాలయం లోపలికి చొరబడి అక్కడ బహిరంగంగా కొందరిపై కాల్పులు జరిపి కొంతమందిని బందీలుగా ఉంచారన్న సమాచారంతో సమాచారం అందుకున్న ఆక్టోపస్ దళాలు ఆపరేషన్‌ను ప్రారంభించారు. ఆక్టోపస్ దళాలు అత్యాధునిక ఆయుధాలతో పోలీసు జాగిలాలతో ఉగ్రవాదులను న్యూట్రలైజ్‌చేసి వారి చేతిలో బందీగా ఉన్న వారిని సురక్షితంగా రక్షించడంతో మాక్ డ్రిల్ ముగిసింది. కార్యక్రమంలో గెయిల్ జీఎం కేబీ నారాయణ, డీజీఎం ఎస్వీ మూర్తి, ప్రభాకర్ దివి, సెక్యూరిటీ ఆఫీసర్ పి.సాగర్‌కుమార్, ఆక్టోపస్ డీఎస్పీ రాంబాబు, తహశీల్దార్ సునీల్‌కుమార్, నగరం ఎస్ఐ ఎ.చైతన్యకుమార్, ఆక్టోపస్ సీఐ జి.శివప్రసాద్, రెవెన్యూ, మెడికల్, ఫైర్ అండ్ సేఫ్టీ అధికారులు పాల్గొన్నారు

సెప్టిక్ వాహనాలకు దరఖాసు చేసుకోండి
అమలాపురం టౌన్, నవంబరు 21(ఆంధ్రజ్యోతి): సెప్టిక్ ట్యాంకు క్లీనింగ్ వాహనాలను పొందేందుకు అర్హులైన వారు స్వయంగా లేదా పోస్టు ద్వారా దరఖాస్తులు అందించాలని జిల్లా షెడ్యూల్డు కులాల సహకార సంఘం కార్యనిర్వాహక సంచాలకురాలు జె.సత్యవతి కోరారు. జిల్లాలో సఫాయి కర్మచారి వృత్తిలో ఉన్న నిరుద్యోగ యువతకు ఎన్ఎస్‌కే ఎఫ్‌డీసీ పథకంలో భాగంగా రాయితీపై సెప్టిక్ ట్యాంకు క్లీనింగ్ వాహనాలను మంజూరు చేస్తున్నామన్నారు. కాకినాడ జిల్లాకు మంజూరు చేసిన 3వేల లీటర్ల సామర్థ్యం గల సెప్టిక్ ట్యాంకు క్లీనింగ్ వాహనాల లబ్ధిదారులు రుణాలను సకాలంలో తిరిగి చెల్లించడంలో విఫలమయ్యారని, ఆ లబ్ధిదారులకు చెందిన క్లీనింగ్ వాహనాలను తిరిగి షరతుల మేరకు మంజూరు చేస్తామన్నారు. ఆసక్తి గల అభ్యర్థులు ఐదుగురు కలసి ఒక గ్రూపును ఏర్పాటు చేసుకోవాలని, సఫాయి కర్మచారి సర్టిఫికెట్లు తప్పనిసరిగా కలిగి ఉండాలని, గ్రూపు సభ్యుల్లో ఒకరికి హెవీ మోటారు వెహికల్ డ్రైవింగ్ లైసెన్సు ఉండాలని, ఒక్కో వాయిదాకు రూ.33,064 చొప్పున క్రమం తప్పకుండా తిరిగి చెల్లించాలని ఆమె కోరారు. దరఖాస్తుదారులు కాకినాడ జీజీహెచ్‌కు ఎదురుగా ఉన్న ప్రగతి భవన్‌లోని జిల్లా ఎస్సీ కార్పొరేషన్ కార్యాలయంలో ఈనెల30వ తేదీలోగా దరఖాస్తులు అందించాలన్నారు. వివరాలకు సెల్ 6281817023ని సంప్రదించాలని సత్యవతి కోరారు.

ఏపీ ఎన్జీవో తాలూకా యూనిట్ ఎన్నికలు
అమలాపురం, నవంబరు 21(ఆంధ్రజ్యోతి): ఏపీ ఎన్జీవోల అమలాపురం తాలూకా యూనిట్ నూతన కార్యవర్గ ఎన్నికలు శుక్రవారం స్థానిక కాటన్ అతిథిగృహంలో జరిగాయి. కోనసీమ జిల్లా ఎన్జీవో సంఘ అధ్యక్షుడు మాదవరపు వెంకటేశ్వరరావు అధ్యక్షతన జరిగిన సమావేశంలో ఎన్నికల అధికారులుగా డీఎస్ఎన్ సుబ్రహ్మణ్యం, ఐ.ప్రతాప్‌లు వ్యవహరించారు. తాలూకా యూనిట్ ఏపీఎన్జీవో సంఘం ఏకగ్రీవంగా ఎన్నిక జరిగింది. యూనిట్ అధ్యక్షుడిగా నిమ్మకాయల శ్రీను, అసోసియేట్ ప్రెసిడెంట్‌గా మహాదశ శ్రీనివాసరావు, సెక్రటరీగా పి.కోదండరామయ్య, ట్రెజరర్‌గా డి.పృథ్విరాజ్, ఉపాధ్యక్షులుగా డి.రామకృష్ణ, డి.శ్రీనివాస్‌లు ఎన్నికైనట్టు ఎన్నికల అధికారులు ప్రకటించారు. వీరిని ఏపీపీఆర్డీ ఇంజనీర్స్ అసోసియేషన్‌స్టేట్ ఆర్గనైజింగ్ కార్యదర్శి అన్యం రాంబాబు, దుర్గ కొండలరావు, ఎడ్యుకేటివ్ ఇంజనీర్ పులి రామకృష్ణారెడ్డి అభినందించారు.

అంగన్‌వాడీల బలోపేతానికి కృషి
మలికిపురం, నవంబరు 21(ఆంధ్రజ్యోతి): అంగన్‌వాడీల బలోపేతానికి వర్కర్లు కృషి చేయాలని ఎమ్మెల్యే దేవ వరప్రసాద్ అన్నారు. విశ్వేశ్వరాయపురంలో ఆయన క్యాంపు కార్యాలయం వద్ద మినీ అంగన్‌వాడీలు అప్‌గ్రేడ్ అయిన తొమ్మిది మందికి నియామక పత్రాలు అందజేశారు. అప్‌గ్రేడ్ అయిన పొన్నమండ, సఖినేటిపల్లి, గుడిమెళ్లంక, రామరాజులంక, శంకరగుప్తం, మామిడికుదురు, గోగన్నమఠం, కరవాకల అంగన్‌వాడీల వర్కర్లకు శుభాకాంక్షలు తెలిపారు. సీడీపీవోలు సీహెచ్ ఇందిర, వై.విజయశ్రీపాల్గొన్నారు.

దోమలను లార్వా దశలో నిర్మూలించాలి
అంబాజీపేట, నవంబరు 21(ఆంధ్రజ్యోతి): దోమలను లార్వా దశలోనే నిర్మూలించుకోవాలని జిల్లా మలేరియా అధికారి నక్కా వెంకటేశ్వరరావు సూచించారు. అంబాజీపేట పీహెచ్‌సీ పరిధిలోని మాచవరం-1, గంగలకుర్రు గ్రామాల్లో శుక్రవారం శుభ్రవారం.. పొడివారం కార్యక్రమాన్ని శుక్రవారం ఆయన పరిశీలించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలన్నారు. నివాస ప్రాంతాల మధ్య మురుగునీరు నిల్వ లేకుండా ప్రత్యేక శ్రద్ధ వహించాలన్నారు. గంగలకుర్రులోని సమీకృత వసతి గృహాన్ని ఆయన సందర్శించి విద్యార్థులకు పలు సూచనలు చేశారు. ఆయుష్మాన్ కేంద్రాన్ని సందర్శించి కీటక జనిత వ్యాధుల వ్యాప్తి, నియంత్రణ చర్యలు, నీటి ద్వారా వచ్చే వ్యాధులు, వాటర్ టెస్టింగ్ అంశాలపై ఆరా తీశారు. వైద్య సిబ్బంది తదితరులుపాల్గొన్నారు.

బులియన్ అసోసియేషన్ అధ్యక్షుడిగా రెడ్డి
అమలాపురంటౌన్,నవంబరు21(ఆంధ్రజ్యోతి): అమలాపురం బులియన్ అసోసియేషన్ నూతన కార్యవర్గం శనివారంస్థానిక గోల్డ్‌మార్కెట్ భవనంలో ప్రమాణ స్వీకారం చేశారు. సంఘ గౌరవాధ్యక్షుడిగా రేకపల్లి సూరిబాబు, అధ్యక్షుడిగా ద్వారంపూడి సత్యనారాయణరెడ్డి, కార్యదర్శిగా యర్రంశెట్టి నారాయణమూర్తి, కోశాధికారిగా చవ్వాకుల కృష్ణ, ఉపాధ్యక్షులుగా రవణం సుధాకర్, ఉపకోశాధికారిగా పబ్బతి ప్రసాద్ తదితరులు ప్రమాణ స్వీకారం చేశారు. ముఖ్య సలహాదారు బోనం సత్యవరప్రసాద్, సలహాదారు చింతలపూడి సత్తిబాబు, మాజీ అధ్యక్షుడు మేడిచర్ల త్రిమూర్తులు, రాయుడు నాని, మానే ప్రకాష్, కట్టోజు రాము, మద్దింశెట్టి ప్రసాద్ పాల్గొన్నారు.

పవిత్ర కార్తీక మాసం ముగింపు
అమలాపురం రూరల్, నవంబరు 21(ఆంధ్రజ్యోతి): పవిత్ర కార్తీకమాసం ముగింపు సందర్భంగా శివాలయాల్లో ప్రత్యేక పూజలు నిర్వహించారు. మహిళలు పాడ్యమి దీపాలను విడిచిపెట్టారు. బండారులంక శ్రీభువనేశ్వరి సమేత త్రయంబకేశ్వరస్వామి ఆలయంలో భక్తులు 54రకాల ప్రసాదాలను స్వామివారికి సమర్పించారు. శనివారం ఉదయం నుంచి పూజలు, అభిషేకాల అనంతరం ప్రసాద వితరణ నిర్వహించారు. కార్యక్రమంలో శ్రీశైలం దేవస్థానం మాజీ ట్రస్టీ చింతా శంకరమూర్తి, ఆలయ పురోహితులు గుమ్మిడి సద్గురు సత్యనారాయణ, కొండా చంటి, గోళ్ల మల్లేశ్వరరావు, చింతా ఉమా, యినుమర్తి లింగమూర్తి తదితరులు పాల్గొన్నారు.

రాజ్యాంగ దినోత్సవ సభను విజయవంతం చేయాలి
మామిడికుదురు, నవంబరు 21(ఆంధ్రజ్యోతి): అమలాపురంలో ఈనెల 26న జరిగే భారత రాజ్యాంగ దినోత్సవ సభను విజయవంతం చేయాలని పీడీఎం రాష్ట్ర నేత దీపక్‌శివకుమార్ కోరారు. పెదపట్నం గ్రామంలో శుక్రవారం భూపతి వెంకటపతి ఇంటి వద్ద సభకు సంబంధించిన కరపత్రాలు ఆవిష్కరించారు. అమలాపురంలోని అంబేడ్కర్ సామాజిక భవనం వద్ద ఈనెల26న రాజ్యాంగ దినోత్సవ సభను నిర్వహిస్తున్నామని, ప్రజాసంఘాలు, ప్రజాస్వామికవాదులు ఈసభకు హాజరు కావాలని కోరారు. అంబేడ్కర్ యువజన సంక్షేమ సంఘ అధ్యక్షుడు కలిగితి పల్లంరాజు, బత్తుల జనార్ధనరావు, ముస్కూడి నరసింహస్వామి, నూటుకుర్తి సత్యనారాయణ, నెల్లి దుర్గాప్రసాద్, నీడిపూడి చంద్రరావు, నీతిపూడి మహేష్ పాల్గొన్నారు.

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం
కాట్రేనికోన, నవంబరు 21(ఆంధ్రజ్యోతి): పల్లంకుర్రులో నూతనంగా నిర్మిస్తున్న విద్యుత్ సబ్‌స్టేషన్ పనుల నిమిత్తం కాట్రేనికోన సబ్‌స్టేషన్ పరిధిలో శనివారం సరఫరాకు అంతరాయం కల్గుతుందని అమలాపురం ట్రాన్స్‌కో ఈఈ కె.రాంబాబు తెలిపారు. ఉదయం 9నుంచి 2గంటల వరకు మండలంలోని అన్ని గ్రామాలకు విద్యుత్ సరఫరా ఉండదన్నారు.

ఎస్‌బీఐ మెయిన్ బ్రాంచిలో షార్ట్‌సర్క్యూట్
అమలాపురం టౌన్, నవంబరు 21(ఆంధ్రజ్యోతి): అమలాపురం ఎస్‌బీఐ మెయిన్ బ్రాంచిలో ఏసీ అవుట్‌డోర్ యూనిట్లు విద్యుత్ షార్ట్‌సర్క్యూట్ కావడంతో శనివారం ఉదయం మంటలు వ్యాపించాయి. సకాలంలో స్పందించిన సిబ్బంది అమలాపురం అగ్నిమాపకశాఖ కార్యాలయానికి సమాచారం అందించారు. అగ్నిమాపక అధికారి ఎం.రాజా ఆధ్వర్యంలో సిబ్బంది మంటలను అదుపు చేశారు. విద్యుత్ షార్ట్‌సర్క్యూట్ కారణంగా జరిగిన ప్రమాదంలో రూ.50వేలు నష్టం ఏర్పడినట్టు రాజా తెలిపారు.

ఇంటర్ ప్రవేశాలకు కరపత్రాల ఆవిష్కరణ
అమలాపురం, నవంబరు 21(ఆంధ్రజ్యోతి): ఈవిద్యా సంవత్సరంలో ఇంటర్మీడియట్ మొదటి సంవత్సరంలో ప్రవేశాలకు ప్రచార కరపత్రాన్ని అమలాపురంలోని ప్రభుత్వ బాలికల జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్ సాధనాల శాంతిరాజశ్రీ ఆవిష్కరించారు. ఈసందర్భంగా జరిగిన కార్యక్రమంలో ఆమె మాట్లాడుతూ కళాశాలలో చదివిన విద్యార్థులు ఇంజనీరింగ్, నర్సింగ్, డిప్లమో ఇన్ ఎడ్యుకేషన్ పరీక్షల్లో మంచి ఫలితాలు సాధించినట్టు తెలిపారు. ఇంటర్ మొదటి, రెండో సంవత్సరంలో ప్రస్తుత విద్యా సంవత్సరం నుంచి విద్యార్థులు అడ్మిషన్ తీసుకోవాలని కోరారు. జేఈఈ, నీట్ మొదలైన పరీక్షలకు ప్రత్యేక శిక్షణ ఇస్తున్నట్టు తెలిపారు. కళాశాలలో చదువుతున్న మొత్తం విద్యార్థినులందరికీ పాఠ్య పుస్తకాలు నోటు పుస్తకాలు, ప్రాక్టికల్ రికార్డులను ఉచితంగా అందజేస్తున్నట్టు తెలిపారు. కార్యక్రమంలో కళాశాల అధ్యాపకులు, సిబ్బంది పాల్గొన్నారు.

పొదలాడలో కేడర్ విత్ లీడర్ కార్యక్రమం
రాజోలు, నవంబరు 21(ఆంధ్రజ్యోతి): పొదలాడలో జీఎస్ గార్డెన్స్‌లో రాజోలు నియోజకవర్గ టీడీపీ ఇన్‌చార్జి గొల్లపల్లి అమూల్య శుక్రవారం కేడర్ విత్ లీడర్ కార్యక్రమం నిర్వహించారు. నియోజకవర్గంలోని వివిధ గ్రామాల నుంచి ప్రజల నుంచి ఆమె అర్జీలు స్వీకరించారు. ఈసందర్భంగా ఇన్‌చార్జి అమూల్య మాట్లాడుతూ పార్టీ శ్రేణులకు, ప్రజలకు ఎటువంటి సమస్యలున్నా సమస్యల పరిష్కార వేదిక కేడర్ విత్ లీడర్ కార్యక్రమంలో మా దృష్టికి తీసుకువస్తే త్వరితగతిన పరిష్కరించడానికి ప్రయత్నం చేస్తామన్నారు. కార్యక్రమంలో రోడ్డు డెవలెప్మెంట్ కార్పొరేషన్ డైరెక్టర్ ముదునూరి చినబాబురాజు, టీడీపీ రాజోలు నియోజకవర్గ పరిశీలకుడు చిటికెల రామ్మోహనరావు, డెల్టా మాజీ చైర్మన్ భూపతిరాజు ఈశ్వరరాజువర్మ, పెద్దాపురం టీడీపీ పరిశీలకుడు బోళ్ల వెంకటరమణ, కట్టా సూరిబాబు పాల్గొన్నారు.

చేప పిల్లల ఉత్పత్తి కేంద్రాన్ని పరిశీలించిన కలెక్టర్
ఐ.పోలవరం, నవంబరు 21(ఆంధ్రజ్యోతి): వరల్డ్ ఫిషరీష్ డే సందర్భంగా ఎమ్మెల్యే దాట్ల బుచ్చిబాబు, కలెక్టర్ ఆర్.మహేష్‌కుమార్ శుక్రవారం పెదమడిలో చేపపిల్లల ఉత్పత్తి కేంద్రాన్ని పరిశీలించారు. రైతు దంతులూరి సీతారామరాజు ఈకేంద్రాన్ని నిర్వహిస్తున్నారు. ఇక్కడ వివిధ రకాల చేపపిల్లలను ఉత్పత్తి చేసి ఇతర ప్రాంతాలకు సరఫరా చేస్తున్నారు. కలెక్టర్ ఈ కేంద్రాన్ని పరిశీలించి వివరాలు సేకరించారు. ఇతర రైతులు కూడా ఈవిధంగా కేంద్రాలు నిర్వహించి మత్స్య సంపద అభివృద్ధికి కృషి చెయ్యాలన్నారు. ఈకార్యక్రమంలో ఆర్డీవో కె.మాధవి, తహసీల్దార్ సీహెచ్ విజయశ్రీ, డీటీ మహాలక్ష్మీనాయుడు, వీఆర్వో కిరణ్ తదితరులు పాల్గొన్నారు.

రాష్ట్ర స్థాయి పవర్‌లిఫ్టింగ్ పోటీలకు శానపల్లిలంక విద్యార్థి
అయినవిల్లి, నవంబరు 21(ఆంధ్రజ్యోతి): ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా స్కూలు గేమ్స్ ఫెడరేషన్ అండర్-17 బాలబాలికల పవర్ లిఫ్టింగ్ పోటీల్లో శానపల్లిలంక జిల్లాపరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థి మణికంఠ సత్తా చాటాడు. విద్యార్థి ఎస్ఎస్ మణికంఠ 105 కిలోల విభాగంలో ప్రథమస్థానం సాధించి రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికయ్యాడు. సత్తా చాటిన మణికంఠను శుక్రవారం పాఠశాల ప్రధానోపాధ్యాయుడు జె.బాలకృష్ణ, పాఠశాల విద్యాకమిటీ చైర్మన్ యల్లమెల్లి విజయ్‌కుమార్, గ్రామపెద్దలు అభినందించారు.

'గ్రామాల పరిశుభ్రతలో మీరే కీలకం'
అమలాపురం రూరల్, నవంబరు 21(ఆంధ్రజ్యోతి): గ్రామాలను పరిశుభ్రంగా ఉంచడంలో క్లాప్ మిత్రలే కీలకమని జిల్లా పంచయతీ అధికారి డి.శాంతలక్ష్మి పేర్కొన్నారు. తడిచెత్త, పొడిచెత్తను వేర్వేరుగా సేకరించే విధానాన్ని ఆమె క్షేత్రస్థాయిలో పరిశీలించారు. ఆ దిశగా ప్రజల్లో ముందుగా చైతన్యం తీసుకురావాలని క్లాప్ మిత్రలకు సూచించారు. భట్నవిల్లిలో శుక్రవారం క్లాప్‌మిత్రల శిక్షణ కార్యక్రమాన్ని డీపీవో సందర్శించారు. చెత్త నుంచి సంపద తయారీ కేంద్రాలను నిర్వహించే విధానంపై క్లాప్‌మిత్రలకు పూర్తి అవగాహన కలిగించే విధంగా శిక్షణ ఇచ్చారు. గ్రామ కార్యదర్శి రెడ్డి శిరీష, వివిధ గ్రామాల కార్యదర్శులు రుద్రరాజు ఎస్ఎస్ సూరపరాజు, కోరుమిల్లి శ్రీనివాస్, నడింపల్లి రామకృష్ణంరాజు, సుబ్బలక్ష్మి పాల్గొన్నారు. ఇంటింటికీ తిరిగి చెత్త సేకరణ విధానాన్ని డీపీవో క్షేత్రస్థాయిలో పరిశీలన జరిపారు.

టైప్ పరీక్షలు రెండు రోజులు నిర్వహించాలి
అమలాపురం, నవంబరు 21(ఆంధ్రజ్యోతి): టైప్ పరీక్షలను రెండు రోజులు నిర్వహించాలని ఆల్‌ప్రిన్సిపాల్స్ ఆఫ్‌టెక్నికల్‌అండ్ కంప్యూటర్స్ ఇనిస్టిట్యూట్ అసోసియేషన్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేసింది. ప్రభుత్వ ప్రైవేటు సంస్థల్లో టైప్‌కు చాలా ప్రాధాన్యం ఉందని, టైప్ విద్యార్థుల సౌకర్యార్థం ప్రభుత్వం రెండు రోజులు పరీక్షలు నిర్వహించాలని ప్రభుత్వాన్ని కోరారు.

ఉద్యోగుల సహకారంతోనే అభివృద్ధి సాధ్యం


విలసవిల్లి సర్పంచ్ ఊర్మిళాసతీష్ అధ్యక్షతన ఎంపీడీవో, ఉద్యోగులను సన్మానిస్తున్న దృశ్యం

ఉప్పలగుప్తం, నవంబరు 21(ఆంధ్రజ్యోతి): ఉద్యోగులు సేవాభావంతో సహకరిస్తేనే గ్రామాల్లోఅభివృద్ధి సాధ్యమవుతుందన్న విషయం తమ గ్రామంలోనిరూపితమైందని విలసవిల్లి సర్పంచ్ సలాది ఊర్మిళాసతీష్ అన్నారు. ఉద్యోగులు, అధికారుల సహాయంతో విసలవిల్లిని మండలంలోనే ప్రథమ స్థానంలో నిలిపామన్న సంతృప్తి మిగిలిందని ఆమె వ్యాఖ్యానించారు. బదిలీపై వెళ్లిన సచివాలయ ఉద్యోగులు, కార్యదర్శులతో పాటు ఎంపీడీవో జి.కృష్ణ, డిప్యూటీ ఎంపీడీవో రామకృష్ణ, ఎంపీడీవో కార్యాలయ పాలనాధికారి బీహెచ్ తులసీకృష్ణలను సలాది సతీష్ ఆధ్వర్యంలో సర్పంచ్ శుక్రవారం సన్మానించారు. వాసా వీరభద్రుడు, కోలా ఏసు, కారుపర్తి గిరిజాపతి, పుత్సల ఏసు, బళ్ల నాగసతీష్, బీర నరసింహమూర్తి పాల్గొన్నారు.

తైక్వాండోతో ఆత్మరక్షణ
అంబాజీపేట, నవంబరు21(ఆంధ్రజ్యోతి): తైక్వాండో ఆత్మరక్షణతో పాటు మానసికోల్లాసం కలుగుతుందని జిల్లా విద్యాశాఖాధికారి డాక్టర్ షేక్ సలీంబాషా అన్నారు. అంబాజీపేట జిల్లా పరిషత్ హైస్కూల్‌లో రాణి లక్ష్మీబాయి ఆత్మ నిర్భర శిక్షణ కార్యక్రమాన్ని శుక్రవారం నిర్వహించారు. ఈసందర్భంగా డీఈవో మాట్లాడుతూ జిల్లాలోని అన్ని జిల్లా పరిషత్ హైస్కూల్స్‌లో 6 నుంచి 12వ తరగతి చదువుతోన్న బాలికలకు ఆత్మరక్షణ శిక్షణ ఇస్తున్నామన్నారు. అనంతరం స్థానిక జిల్లా పరిషత్ హైస్కూల్‌లో పదో తరగతి చదువుతోన్న విద్యార్థులకు డీఎన్ శెట్టి అన్నపూర్ణ దంపతులు సమకూర్చిన స్టడీ మెటీరియల్‌ను శుక్రవారం ఆయన పంపిణీ చేశారు. సమగ్రశిక్ష అడిషనల్ ప్రాజెక్టు కోఆర్డినేటర్ జి.మమ్మి, సమగ్ర శిక్ష బాలిక సంరక్షణాధికారి ఏపీవో ఎంఎకే భీమారావు, ఎంఈవోలు కాండ్రేగుల వెంకటేశ్వరరావు, మోకా ప్రకాష్, తైక్వాండో సీనియర్ కోచ్ పితాని త్రిమూర్తులు, హెచ్ఎం సాయిరాం, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

ఘనంగా మత్స్యకారుల దినోత్సవం
యానాం, నవంబరు 21(ఆంధ్రజ్యోతి):యానాంలో ప్రపంచ మత్స్యశాఖ దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. స్థానిక అగ్నికుల క్షత్రియ కల్యాణ మండపంలో సంక్షేమ సేవా సంఘ ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా ప్రభుత్వ ఢిల్లీ ప్రత్యేక ప్రతినిధి మల్లాడి కృష్ణారావు హాజరయ్యారు. ఈసందర్భంగా మల్లాడి కేక్‌ను కట్‌చేసి నాయకులకు తినిపించారు. అనంతరం మల్లాడి మాట్లాడుతూ యానాంలో ఇటీవల జరిగిన గ్యాస్ పైప్‌లైన్ లీకేజీ నష్టంతో పాటు గతంలో జీఎస్‌పీసీ నుంచి 661 మంది లబ్ధిదారులకు రావాల్సిన పరిహారం గురించి ప్రస్తావించారు. ప్రభుత్వ అనుమతి ఇచ్చినా ప్రారంభం కాని పలు అభివృద్ధి పనుల గురించి మల్లాడి వివరించారు. కుల సమావేశాలు ఐక్యత కోసమే తప్ప ఇతర కులాలను ద్వేషించడం, తక్కువ చేయడం కాదన్నారు. అనంతరం మల్లాడిని సంఘ సభ్యులు ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో మత్స్యకార సంఘ నాయకులు శేరు కృష్ణా, మల్లాడి శామ్యూల్ పాల్గొన్నారు.

ముగిసిన సాగర్ కవాచ్
అంతర్వేది, నవంబరు 21(ఆంధ్రజ్యోతి): సముద్ర తీర ప్రాంతంలో మెరైన్, సివిల్ పోలీసుల ఆధ్వర్యంలో సాగర్ కవాచ్ కార్యక్రమం శుక్రవారం నిర్వహించారు. తీరం వెంబడి పోలీసులు గస్తీ చర్యల్లో పాల్గొని విధులు నిర్వహించారు. హార్బరు సమీపంలో రాజోలు సీఐ టీవీ నరేష్, ఎస్ఐ దుర్గాశ్రీనివాస్, మెరైన్ పోలీసులు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.


కేశవరంలో పర్యటిస్తున్న ఎమ్మెల్యే వేగుళ్ల జోగేశ్వరరావు, ఏపీఐడీసీ చైర్మన్ లీలాకృష్ణ

సీసీ రోడ్లకు ప్రతిపాదనలు సిద్ధం చేయండి

ఎమ్మెల్యే వేగుళ్ల జోగేశ్వరరావు

మండపేట, నవంబరు 21(ఆంధ్రజ్యోతి): కేశవరం పంచాయతీలోని ఎస్సీ కాలనీల్లో సీసీ రోడ్ల నిర్మాణానికి ప్రతిపాదనలు సిద్ధం చేయాలని మండపేట ఎమ్మెల్యే వేగుళ్ల జోగేశ్వరరావు అధికారులను ఆదేశించారు. శుక్రవారం ఆయన ఎస్సీ కాలనీలను ఏపీఐడీసీ చైర్మన్ వేగుళ్ల లీలాకృష్ణ స్థానిక కూటమి నాయకులతో కలిసి పరిశీలించారు. ప్రజల సమస్యలను ఎమ్మెల్యే తదితరులు తెలుసుకున్నారు. కాలనీలో సీసీ రోడ్లు నిర్మించేందుకు చర్యలు తీసుకుంటామని ఆయన అన్నారు. కార్యక్రమంలో వారి వెంట టీడీపీ మండల అధ్యక్షుడు కర్రి తాతారావు, ఎంపీపీ వాసు, గ్రంథాలయ సంస్థ మాజీ చైర్మన్ వీర్రెడ్డి, యు.సురేష్, తాతాజీ, గారపాటి శ్రీనువాస్, ఆళ్ల రాజు తదితరులు పాల్గొన్నారు.

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

మండపేట, నవంబరు 21(ఆంధ్రజ్యోతి): తాపేశ్వరం సబ్‌స్టేషన్ పరిధిలోగల అర్తమూరు, తాపేశ్వరం, పేకేటిపాకలు, మెర్నిపాడు ఇప్పనపాడు పాలతోడు గ్రామాలకు నేటి ఉదయం 8 గంటల నుంచి మధ్యాహ్నం వరకు కరెంట్ సరఫరాకు అంతరాయం కలుగుతుందని విద్యుత్‌శాఖ ఈఈ కె.రత్నాలరావు తెలిపారు.

వ్యర్థాలతో సాగునీటికి అవస్థలు

• అధికారుల ఉదాశీనతపై రైతుల అసంతృప్తి • యుద్ధ ప్రాతిపదికన సమస్య పరిష్కరించాలని వినతి

ఆలమూరు, నవంబరు 21(ఆంధ్రజ్యోతి): ధవళేశ్వరం బ్యారేజ్ నుంచి నేరుగా వచ్చే తూర్పు కాలువలో కోరంగి ప్రధాన కాలువ దుస్థితిపై రైతులు అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు. ఆలమూరు మండలం మడికి వద్ద కోరంగి ప్రధాన కాలువ దుస్థితి ఇలా ఉంటే రబీకి సాగునీరు ఎలా పారుతుందని రైతులు ప్రశ్నిస్తున్నారు. గత ప్రభుత్వంలో సాగునీటి సంఘాలు లేకపోవడంతో పట్టించుకున్న వారే లేరని ఆయా ప్రాంత రైతులు ఆరోపిస్తున్నారు. ధవళేశ్వరం నుంచి వచ్చే తూర్పు కాలువలోనే వ్యర్థాలు అధికంగా ఉండటం వల్ల సాగునీరు ముందుకు సాగడం లేదని రైతులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఇటీవల పలువురు కాలువల్లో వ్యర్థాలను వేయడం వల్ల అనేక ఇబ్బందులు తలెత్తు తున్నాయని రైతులు ఆరోపిస్తున్నారు. రైతుల ప్రయోజనాలను దృష్టిలో పెట్టుకుని కాలువల్లో వ్యర్థాలు వేయకుండా చర్యలు తీసుకోవాలని రైతులు కోరుతున్నారు. సాగునీటి సంఘాల ప్రతినిధులు ఎప్పటికప్పుడు వీటిని తొలగిస్తే ఇబ్బందులు ఉండవని వారు వ్యాఖ్యానిస్తున్నారు.


మడికి వద్ద వ్యర్థాలతో నిండిపోయిన కోరంగి ప్రధాన కాలువ

నవాబుపేటలో క్లీన్ అండ్ గ్రీన్‌పై శిక్షణ

ఆలమూరు, నవంబరు 21(ఆంధ్రజ్యోతి): ఇంటింటా చెత్త సేకరణతో పాటు చెత్త నుంచి సంపద తయారీ విధానాలపై నవాబుపేటలో శుక్రవారం శిక్షణ తరగతులు నిర్వహించారు. ఇందులో భాగంగా ఎంపీడీవో ఎ.రాజు అధ్వర్యంలో మండల వ్యాప్తంగా నవాబుపేట గ్రామంలో దీన్ని నిర్వహించారు. మండల వ్యాప్తంగా ఉన్న క్లాప్ మిత్రాలు, షెడ్ మిత్రాలతో గ్రామ కార్యదర్శులకు శిక్షణ ఇచ్చారు. ఆయా గ్రామాల్లో ఎలాంటి సమస్యలు ఎదురవుతున్నాయనే అంశాలను చర్చించారు. మండలంలోని పారిశుధ్య కార్మికులు అధిక సంఖ్యలో వెళ్లి నవాబుపేట గ్రామాన్ని క్లీన్ అండ్ గ్రీన్‌గా చేశారు. పారిశుధ్య నిర్వహణలో ప్రజల పాత్రపై ఎంపీడీవో అధ్వర్యంలో అవగాహన సదస్సు నిర్వహించారు. కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శులు, పలువురు ఉద్యోగులు పాల్గొన్నారు.

భక్తిశ్రద్ధలతో పోలి పాడ్యమి


కపిలేశ్వరపురం మండలం గౌతమీ గోదావరి నదిలో దీపాలు విడిచిపెడుతున్న దృశ్యం

ద్రాక్షారామ, నవంబరు 21(ఆంధ్రజ్యోతి): ద్రాక్షారామ భీమేశ్వరాలయంలో శుక్రవారం పోలి పాడ్యమిని పురస్కరించుకుని అధిక సంఖ్యలో భక్తులు స్వామివారిని దర్శించుకున్నారు. తెల్లవారుజామున మహిళలు సప్తగోదావరిలో పుణ్య స్నానాలు చేసి పాడ్యమి దీపాలు వెలిగించారు. భీమేశ్వరస్వామివారు, మాణిక్యాంబ అమ్మవార్లను దర్శించుకుని పూజలు జరిపారు. అశ్వత్థ నారాయణ వృక్షం చుట్టూ ప్రదక్షిణలు చేశారు. ఉదయం నుంచి మధ్యాహ్నం వరకు అధిక సంఖ్యలోభక్తులు స్వామివారిని దర్శించుకున్నారు. శుక్రవారంతో కార్తీకమాసం ముగిసింది.

శైవక్షేత్రాల్లో ప్రత్యేక పూజలు

ఆలమూరు, నవంబరు 21(ఆంధ్రజ్యోతి): ఆలమూరులో పోలి పాడ్యమిని మహిళలు భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. శుక్రవారం తెల్లవారుజామునే మహిళా భక్తులు కాల్వల వద్ద దీపాలు వెలిగించి విడిచిపెట్టారు. మండలంలోని ఆలమూరు, చింతలూరు, పెనికేరు, జొన్నాడ, చొప్పెల్ల, మడికి నవాబుపేట, నర్సిపూడి, మోదుకూరు, గుమ్మిలేరు, పెదపళ్ల, పినపళ్ల, సంధిపూడి కలవచర్ల, మూలస్థానం గ్రామాల్లోని ఆయా శివాలయాల్లో ప్రత్యేక పూజలు నిర్వహించి స్వామివారిని దర్శించుకున్నారు.

ముగిసిన కార్తీకమాసం పూజలు

ఆత్రేయపురం, నవంబరు 21(ఆంధ్రజ్యోతి): నెలరోజుల పాటు భక్తిశ్రద్ధలతో జరుపుకున్న కార్తీకమాసం కార్యక్రమాలను శుక్రవారం పోలి పాడ్యమితో ఘనంగా ముగిసింది. ఇందులో భాగంగా శుక్రవారం తెల్లవారుజాము నుంచే మహిళలు ఆయా ఆలయాల్లో భక్తిశ్రద్ధలతో దీపాలు వెలిగించి పూజలు జరిపారు. కార్తీక మాసం నెల రోజులపాటు దామోదరుడిని భక్తిశ్రద్ధలతో పూజించి ఆయా శైవక్షేత్రాల్లో పూజలు నిర్వహించారు.

ఆలయాల్లో ప్రత్యేక అభిషేకాలు

కపిలేశ్వరపురం, నవంబరు 21(ఆంధ్రజ్యోతి): మండలంలోని ఆయా గ్రామాల్లో శుక్రవారం పోలిపాడ్యమి పూజలను భక్తులు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా మహిళలు, గోదావరి నది, కాలువల్లో వేకువజామునే పుణ్యస్నానాలు చేసి దీపాలు విడిచిపెట్టారు అనంతరం ఆయా ఆలయాల్లో స్వామివార్లకు అభిషేకాలు, ప్రత్యేక పూజలు జరిపారు. స్థానిక అగస్తేశ్వర పాపవినాశేశ్వరస్వామి ఆలయంలో భక్తులు స్వామివారిని దర్శించుకున్నారు. కార్యక్రమాల్లో ఆయా గ్రామస్తులతో పాటు అధిక సంఖ్యలో మహిళలు, భక్తులు పాల్గొన్నారు.

పుట్టపర్తికి ఆత్రేయపురం పూతరేకులు

ఆత్రేయపురం, నవంబరు 21(ఆంధ్రజ్యోతి): సత్యసాయి శత జయంతి ఉత్సవానికి మహా ప్రసాదంగా ఆత్రేయపురం పూతరేకులు పంపిస్తున్నారు. సత్యసాయి భక్త సమాజం రాజమహేంద్రవరం సహకారంతో ఆత్రేయపురం పికానా ఫుడ్స్ ఆధ్వర్యంలో తయారు చేసిన పూతరేకుల వాహనాన్ని శుక్రవారం పుట్టపర్తికి పంపించారు. ఈనెల 23న సత్యసాయి జయంతి సందర్భంగా పికాని ఫుడ్స్ అధినేత గాదిరాజు ప్రసాదరాజు వాటిని పంపించారు. వాడపల్లి వేంకటేశ్వర స్వామి ఆలయ చైర్మన్ ముదునూరి వెంకట్రాజు ఈ వాహనానికి జెండా ఊపి పంపారు. కార్యక్రమంలో సత్యసాయి భక్త సమాజం ప్రతినిధులు పాల్గొన్నారు.

వచ్చేనెల 5నాటికి టిడ్కో ఫేజ్ 2 లబ్ధిదారులకు అందించాలి

మండపేట, నవంబరు 21(ఆంధ్రజ్యోతి): మండపేటలోని గొల్లపుంతకాలనీలో నిర్మించిన టిడ్కో గృహాల ఫేజ్2 సముదాయంలో ఆయా పనులు పూర్తి చేసి వచ్చేనెల 5వ తేదీకల్లా లబ్ధిదారులకు ఇచ్చేందుకు ఇళ్లను సిద్ధం చేయాలని ఎమ్మెల్యే వేగుళ్ల జోగేశ్వరరావు అధికారులను ఆదేశించారు. శుక్రవారం క్యాంపు కార్యాలయంలో ఆయన అధికారులతో టిడ్కో గృహాలపై సమావేశం నిర్వహించి ఆయా పనుల తీరును తెలుసుకున్నారు.కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ టీవీ రంగారావు టిడ్కో ఏఈ వివేక్, టీపీవో రమ్య తదితరులు పాల్గొన్నారు.

లీలాకృష్ణ పరామర్శ

మండపేట, నవంబరు 21(ఆంధ్రజ్యోతి) మాతృ వియోగంతో బాధపడుతున్న ఇనపకోళ్ల సత్యనారాయణ(ఐఎస్ఎన్)ను శుక్రవారం ఏపీఐడీసీ చైర్మన్ వేగుళ్ల లీలాకృష్ణ పరామర్శించారు. గొల్లపుంతలో వున్న ఆయన ఇంటికి వెళ్లి సత్యవతి చిత్రపటానికి నివాళులర్పించారు. ఎంపీఎస్ పాఠశాల కరస్పాండెంట్ చిన్నారావు తదితరులు వున్నారు.

ప్రజా సమస్యల పరిష్కారానికి కృషి

ఎమ్మెల్యే బండారు సత్యానందరావు


రావులపాలెం క్యాంపు కార్యాలయంలో ప్రజల వినతులు స్వీకరిస్తున్న ఎమ్మెల్యే బండారు

రావులపాలెం, నవంబరు 21(ఆంధ్రజ్యోతి): ప్రజల సమస్యల పరిష్కారానికి కూటమి ప్రభుత్వం అన్ని విధాలుగా కృషి చేస్తుందని కొత్తపేట ఎమ్మెల్యే బండారు సత్యానందరావు అన్నారు. రావులపాలెం టీడీపీ క్యాంపు కార్యాలయం వద్ద శుక్రవారం ఎమ్మెల్యే ప్రజాదర్బార్ నిర్వహించారు. ప్రజల నుంచి 312 వినతులు స్వీకరించి వాటి పరిష్కారానికి సత్వరమే ఆయా అధికారులకు పంపించారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ అభివృద్ధి, సంక్షేమానికి కూటమి ప్రభుత్వం నిరంతరం కృషి చేస్తుందన్నారు.

అంగన్‌వాడీల అభివృద్ధికి ప్రభుత్వం కృషి: అంగన్‌వాడీ కార్యకర్తలు, టీచర్ల అభివృద్ధికి కూటమి ప్రభుత్వం కృషి చేస్తుందని కొత్తపేట ఎమ్మెల్యే బండారు సత్యానందరావు అన్నారు. రావులపాలెం టీడీపీ క్యాంపు కార్యాలయం వద్ద జరిగిన కార్యక్రమంలో అంగన్‌వాడీ కార్యకర్తలను టీచర్లుగా అప్‌గ్రేడ్ చేస్తూ ఇచ్చిన నియామక పత్రాలను వారికి అందజేశారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ కొత్తపేట మండలంలో 10, రావులపాలెం మండలంలో 8, ఆత్రేయపురంలో 2 మొత్తం 20 మంది టీచర్లుగా అప్‌గ్రేడ్ అయ్యారన్నారు. కార్యక్రమంలో కూటమి నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

స్థానిక సంస్థల ఎన్నికలకు సన్నద్ధం కావాలి: రానున్న స్థానిక సంస్థల ఎన్నికల్లో కూటమి అభ్యర్థులు విజయం సాధించేందుకు నాయకులు, కార్యకర్తలు కృషి చేయాలని కొత్తపేట ఎమ్మెల్యే బండారు సత్యానందరావు అన్నారు. రావులపాలెం క్యాంపు కార్యాలయంలో నాలుగు మండలాలకు చెందిన టీడీపీ నాయకులు, కార్యకర్తలతో సమీక్ష సమావేశం నిర్వహించి మాట్లాడారు. కార్యక్రమంలో టీడీపీ తెలుగు రైతు రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఆకుల రామకృష్ణ, తెలుగు యువత జిల్లా అధ్యక్షుడు చిలువూరి సతీష్‌రాజు, నాలుగు మండలాల నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

'ధాన్యం కొనుగోలులో ఆంక్షలు పెడితే సహించం'


ఏడిద ధాన్యం కొనుగోలు కేంద్రంలో రైతులతో మాట్లాడుతున్న కాంగ్రెస్‌నేత కామన

మండపేట, నవంబరు 21(ఆంధ్రజ్యోతి): ధాన్యం కొనుగోలులో రైతు సేవా కేంద్రాలు ఆంక్షలు విధిస్తే సహించేది లేదని కాంగ్రెస్‌పార్టీ కిసాన్ సెల్ రాష్ట్ర అధ్యక్షుడు కామన ప్రభాకరరావు హెచ్చరించారు. ఏడిద రైతు సేవా కేంద్రం వద్ద శుక్రవారం ధాన్యం కొనుగోలులో కేంద్రం నిర్వాహకులు రైతు నుంచి 15 బస్తాలకు మించి ధాన్యం కొనుగోలు చేయమని చెప్పడంతో స్థానిక రైతులు ఆందోళనకు దిగారు. దీంతో ఆయన చేరుకుని రైతుల సమస్యను ఉన్నతాధికారుల దృష్టికి తీసుకువెళ్లి పరిష్కరించే దిశగా మాట్లాడారు. సమస్య పరిష్కారం కావటంతో రైతులు ఊరట చెందారు. కార్యక్రమంలో రైతులు తదితరులు పాల్గొన్నారు.


వాడపల్లి ఆలయంలో అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేస్తున్న చైర్మన్, ఈవో

అభివృద్ధి పనులకు శంకుస్థాపన

ఆత్రేయపురం, నవంబరు 21(ఆంధ్రజ్యోతి): వాడపల్లి శ్రీ వేంకటేశ్వరస్వామి ఆలయంలో భక్తుల సౌకర్యార్థం చేపడుతున్న వివిధ అభివృద్ధి పనులకు చైర్మన్ ముదునూరి వెంకట్రాజు, ఉపకమిషనరు నల్లం సూర్యచక్రధరరావు శంకుస్థాపన చేశారు. అర్చకులు శాస్త్రోక్తంగా ఆయా పనులకు పూజలు జరిపారు. ఆలయం ఎదురుగా ఉన్న స్వాతంత్ర సమరయోధుల స్థూపాన్ని వేరే ప్రదేశంలో నిర్మించేందుకు చర్యలు చేపట్టారు. పోరాట యోధుల స్థూపాన్ని పునర్నిర్మించి పార్కుగా తీర్చిదిద్దేందుకు శ్రీకారం చుట్టారు. వీటి పనులు త్వరితగతిన చేపడతామన్నారు. అనంతరం ఆలయంలో భక్తుల సౌకర్యార్థం ఆయా పనులపై అర్చకులతో ఆయన సమీక్షించారు.

పరిసరాల శుభ్రతకు ప్రాధాన్యం ఇవ్వాలి

రాయవరం, నవంబరు 21(ఆంధ్రజ్యోతి): పరిసరాల శుభ్రతకు ప్రతి ఒక్కరూ ప్రాధాన్యం ఇవ్వాలని ఎంపీడీవో ఎన్.కీర్తి స్పందన పిలుపునిచ్చారు. శుక్రవారం రాయవరం గ్రామంలో స్వచ్ఛ ఆంధ్రప్రదేశ్, స్వచ్ఛ రాయవరం కార్యక్రమంలో భాగంగా ఉదయం 6 గంటల నుంచి 11 గంటల వరకు గ్రామంలో గ్రీన్ అంబాసిడర్స్, గ్రీన్ గార్డులతో తడి,పొడి చెత్త సేకరణతో పాటు వీధులను శుభ్రపరిచే కార్యక్రమాన్ని నిర్వహించారు. ఎంపీడీవో మాట్లాడుతూ పరిసరాల శుభ్రతతోనే సంపూర్ణ ఆరోగ్యం సాధ్యమవుతుందన్నారు. అనంతరం గ్రామంలో తడిపొడి చెత్త వేరుచేసే విధానం, పరిసరాల శుభ్రతపై అవగాహన కల్పిస్తూ ర్యాలీ జరిపారు. కార్యక్రమంలో ఎంపీపీ ఎన్.వెంకటరమణ, సర్పంచ్ సి.రామకృష్ణ, గ్రామాభివృద్ధి కమిటీ చైర్మన్ ఉండవిల్లి రాంబాబు, డిప్యూటీ ఎంపీడీవో ఎం.శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

పర్యావరణ రక్షణకు పాటుపడాలి

ఆత్రేయపురం, నవంబరు 21(ఆంధ్రజ్యోతి): పరిసరాలను శుభ్రంగా ఉంచుకోవడం ద్వారా ఆరోగ్యవంతమైన సమాజాన్ని నిర్మించుకోవచ్చునని ఎంపీడీవో వెంకటరామన్ పేర్కొన్నారు. శుక్రవారం లొల్ల గ్రామంలో క్లీన్ అండ్ గ్రీన్ విలేజ్ కార్యక్రమంలో భాగంగా గ్రీన్ అంబాసిడర్లు, గ్రీన్ గార్డులు సమన్వయంతో చెత్తకుప్పలను తొలగించి పరిశుభ్రత కార్యక్రమాన్ని నిర్వహించారు. అనంతరం వారితో ప్రత్యేక శిక్షణ నిర్వహించారు. అనంతరం అవగాహన ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో సర్పంచ్ కె.జగన్నాథం, డిప్యూటీ ఎంపీడీవో పీవీఆర్‌కే రాజు తదితరులు పాల్గొన్నారు.

తడిపొడి చెత్తను వేరుచేసి ఎరువుగా మార్చాలి

మండపేట, నవంబరు 21(ఆంధ్రజ్యోతి): గ్రామాల్లో సంపూర్ణ పారిశుధ్య నిర్మూలకు ప్రజలు క్లాప్‌మిత్రలకు సహకరించాలని రామచంద్రపురం డివిజన్ డీఎల్‌డీవో విజయలక్ష్మి ప్రజలకు పిలుపునిచ్చారు. పాలతోడు గ్రామంలో శుక్రవారం క్లాప్‌మిత్రలకు తడిపొడి చెత్త సేకరణపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. పాలతోడు గ్రామంలో శుక్రవారం నిర్వహించిన కార్యక్రమానికి రామచంద్ర పురం డీఎల్‌పీవో వి.విజయలక్ష్మి ముఖ్య అతిథిగా హాజరయ్యారు. తొలుత పంచాయతీ కార్యదర్శులు, హరిత రాయబారులు, క్లాప్‌మిత్రలు, సచివాలయ ఉద్యోగులు, ప్రజాప్రతినిధులు గ్రామంలో పర్యటించి ప్రజలకు అవగాహన కల్పించారు. కార్యక్రమంలో సర్పంచ్ పిల్లా వెంకటలక్ష్మి, పిల్లా తాతీలు, మండల అభివృద్ధి అధికారి సత్యనారాయణ మూర్తి, డిప్యూటీ ఎంపీడీవో దాసరి శ్రీనువాస్, పంచాయతీ కార్యదర్శి ప్రసాద్‌తోపాటు కార్యదర్శులు అమర్‌నాథ్, వర్మ, గ్రీన్ అంబాసిడర్లు క్లాప్‌మిత్రలు తదితరులు పాల్గొన్నారు.

ఎమ్మెల్యే వేగుళ్లను కలిసిన మైనార్టీసెల్ నాయకులు

మండపేట, నవంబరు 21(ఆంధ్రజ్యోతి): టీడీపీ పట్టణ మైనార్టీసెల్ నూతన కార్యవర్గ సభ్యులు శుక్రవారం ఎమ్మెల్యే వేగుళ్ల జోగేశ్వరరావును పార్టీ కార్యాలయంలో కలిసి అభినందించారు. టీడీపీ పట్టణ మైనార్టీ సెల్ అధ్యక్షుడిగా షేక్ కరీంబాబు, ఉపాధ్యక్షుడు షఫ్రక్ మహ్మద్, నిసార్ అహ్మద్ బిలాల్, మహమ్మద్ యూసఫ్, బడేమియా సందానితోపాటు మైనార్టీ నాయకులు మున్సిపల్ కోఆప్షన్ సభ్యుడు షేక్ ఇబ్రహీం, సల్మాన్ హుస్సేన్, ఖరీం ఖాదరి తదితరులు కలిసి ఎమ్మెల్యేను సత్కరించారు.

పీఎంపీ సమావేశానికి ఆహ్వానం

మండపేట(ఆంధ్రజ్యోతి): ఈనెల 29న పీఎంపీ అసోసియేషన్ సమావేశం రాజానగరంలోని జీఎస్ఎల్‌లో జరుగుతుందని వక్తలు తెలిపారు మండపేట ఎమ్మెల్యే వేగుళ్ల హాజరు కావాలంటూ సంఘ నాయకులు కె.సత్యనారాయణ తదితరులు శుక్రవారం ఆయన్ను కలిసి ఆహ్వాన పత్రాన్ని అందజేశారు.

గ్రీన్ అంబాసిడర్స్, గ్రీన్ గార్డులకు శిక్షణ


కె.గంగవరం, నవంబరు 21 (ఆంధ్రజ్యోతి): కె.గంగవరం మండల ప్రజా పరిషత్ కార్యాలయంలో శుక్రవారం గ్రీన్ అంబాసిడర్స్, గ్రీన్ గార్డులకు మండలస్థాయి శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. డిప్యూటీ ఎంపీడీవో భవాని శంకరుడు మాట్లాడుతూ పరిసరాల శుభ్రతపై ప్రజలకు అవగాహన కల్పించాలన్నారు.


శివలలో క్షేత్ర దినోత్సవం నిర్వహిస్తున్న దృశ్యం

రైతులు మేలైన పద్ధతులు పాటించాలి

కె.గంగవరం, నవంబరు 21(ఆంధ్రజ్యోతి): రైతులు మేలైన ఎరువుల యాజమాన్య పద్ధతులు ఆచరించడం ద్వారా అధిక దిగుబడులు సాధించవచ్చునని ఏరువాక కేంద్రం కోఆర్డినేటర్ డాక్టర్ నందకిషోర్ అన్నారు. శుక్రవారం మండలంలోని శివల గ్రామంలో గరిమెళ్ల భాస్కర రామశాస్త్రి పొలంలో క్షేత్ర దినోత్సవాన్ని నిర్వహించారు. ఏడీఏ బి.నాగ కుమార్, డాక్టర్ నందకిషోర్ తదితరులు పలు అంశాలపై మాట్లాడారు. క్షేత్ర ప్రదర్శనలో భాగంగా పంట కోత ప్రయోగం నిర్వహించగా ఎకరానికి 23 బస్తాల దిగుబడి ఇచ్చిందని, వాతావరణం అనుకూలించి ఉంటే ఎకరానికి 30 బస్తాల దిగుబడి వచ్చేదన్నారు. అనంతరం రైతులకు చిరు సంచి పంపిణీ చేశారు. కార్యక్రమంలో నీటి సంఘం అధ్యక్షుడు ఎస్.సుబ్రహ్మణ్యం, నియోజకవర్గ రైతు అధ్యక్షుడు శివప్రసాద్, జిల్లా వనరుల కేంద్రం ఏవో మనోహర్, ఏవో సద్గురుమూర్తి, ఏఈవో హేమంత్, వీఏఏ దేవి, రైతులు పాల్గొన్నారు.

ప్రభుత్వ భాగస్వామ్యంతోనే పీపీపీ అమలు


విలేకరులతో మాట్లాడుతున్న కూటమి నాయకులు

రామచంద్రపురం(ద్రాక్షారామ), నవంబరు 21 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ భాగస్వామ్యంతోనే వైద్య కళాశాలల్లో పీపీపీ అమలు చేస్తామని ఏఎంసీ చైర్మన్ అక్కుల రిష్వంత్‌రాయ్, ఎస్కెపిపి ట్రస్టు చైర్మన్ సలాది నాయుడు మాస్టారు, మున్సిపల్ మాజీ వైస్ చైర్మన్ మేడిశెట్టి సూర్యనారాయణ తదితరులు పేర్కొన్నారు. వైద్య కళాశాలను ప్రైవేటుపరం చేస్తున్నారని వైసీపీ నాయకుల ఆరోపణలు వారు ఖండించారు. శుక్రవారం టీడీపీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో కూటమి నాయకులు మాట్లాడారు. వైద్య రంగానికి ప్రభుత్వం అధిక ప్రాధాన్యం ఇస్తుంటే వైసీపీ నాయకులు విష ప్రచారం చేస్తున్నారన్నారు. పబ్లిక్, ప్రైవేటు పార్టనర్ షిప్‌తో వైద్య కళాశాలలు నిర్మించి మెరుగైన వైద్యవిద్య అందేలా కృషి చేస్తున్నారని అన్నారు. పీపీపీ విధానానికి చట్టబద్ధత లేదని నిరూపించగలరా అని అన్నారు. సమావేశంలో కంచుమర్తి బాబూరావు, కౌన్సిలరు అంకం శ్రీనివాస్, టీడీపీ పట్టణ అధ్యక్షుడు వుండవిల్లి శివ, మాజీ కౌన్సిలరు దంగేటి గౌరీశంకర్, కాటే సుబ్రహ్మణ్యం, కవల నానాజీ తదితరులు పాల్గొన్నారు.

పుస్తక పఠనానికి ప్రాధాన్యం ఇద్దాం

ఆర్డీవో శ్రీకర్

కొత్తపేట, నవంబరు 21(ఆంధ్రజ్యోతి): విద్యార్థులు గ్రంథాలయ పుస్తకాలను చదివేందుకు ప్రాధాన్యం ఇవ్వాలని కొత్తపేట ఆర్డీవో పి.శ్రీకర్ సూచించారు. శుక్రవారం స్థానిక గ్రంథాలయం వద్ద గ్రంథాలయాధికారి కె.సునీత ఆధ్వ ర్యంలో వారోత్సవాల ముగింపు కార్యక్రమానికి ఆర్డీవో ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఆయన మాట్లాడుతూ టీవీ, సెల్‌ఫోన్ వినియోగాన్ని తగ్గించి పుస్తక పఠనంపై దృష్టిసారించాలన్నారు. విద్యార్థుల మనోవికాసానికి పుస్తక పఠనం దోహదపడుతుందన్నారు. అనంతరం జరిగిన చిత్రలేఖనం, వ్యాసరచన, పాటల పోటీల్లో విజేతలుగా నిలిచిన విద్యార్థులకు ప్రశంసా పత్రాలు, బహుమతులు అందజేశారు. అనంతరం ఆర్డీవోను సత్కరించారు. కార్యక్రమంలో రోటరీ క్లబ్ అధ్యక్షుడు ఎస్.వీరన్న, కూచిమంచి సుధాకర్, చామకూర నాగేశ్వరరావు, తహశీల్దారు వై.రాంబాబు తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులు పుస్తక పఠనాన్ని అలవర్చుకోవాలి

రాయవరం, నవంబరు 21 (ఆంధ్రజ్యోతి): చిన్నప్పటి నుంచే విద్యార్థులు పుస్తక పఠనం అలవర్చుకోవాలని మాచవరం సర్పంచ్ కత్తుల సీతా మహాలక్ష్మి కోరారు. శుక్రవారం మాచవరం గ్రంథాలయంలో గ్రంథాలయ వారోత్సవాల ముగింపు కార్యక్రమం నిర్వహించారు. లైబ్రేరియన్ ప్రమీల ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో సర్పంచ్ సీతా మహాలక్ష్మి, సహకార సంఘం అధ్యక్షుడు మేడపాటి రవీంద్రారెడ్డి పాల్గొని మాట్లాడారు. విద్యార్థులు, యువత గ్రంథాలయాలను సద్వినియోగం చేసుకుని విజ్ఞానవంతులు కావాలని పిలుపునిచ్చారు. పోటీ పరీక్షల్లో విజయం సాధించేందుకు గ్రంథాలయాలు ఎంతో ఉపకరిస్తాయన్నారు. అనంతరం విద్యార్థులకు వివిధ రకాల పోటీలు నిర్వహించి విజేతలకు బహుమతులు, సర్టిఫికెట్లు అందజేశారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.



సభలో మాట్లాడుతున్న ఎంపీడీవో భానూజీరావు

సేంద్రియ ఎరువుల విక్రయంతో అదనపు ఆదాయం

కపిలేశ్వరపురం, నవంబరు 21 (ఆంధ్రజ్యోతి): తడి, పొడి చెత్తను వేరుచేసి తడిచెత్తను సేంద్రియ ఎరువుగా చేసి రైతులకు విక్రయించడం ద్వారా ఆదాయం పొందవచ్చని ఎంపీడీవో హెచ్ భానూజీరావు అన్నారు. స్వర్ణాంధ్ర, స్వచ్ఛాంధ్ర కార్యక్రమంలో భాగంగా శుక్రవారం కపిలేశ్వరపురం గ్రామంలో ప్రత్యేక పారిశుధ్య పనులు చేపట్టారు. మండలంలోని ఆయా గ్రామాల నుంచి విచ్చేసిన క్లాప్‌మిత్రలు గ్రామంలో చెత్తను సేకరించి సంపద తయారీ కేంద్రం వద్ద దాన్ని విభజించారు. చెత్త నుంచి వర్మీకంపోస్టు ఎలా తయారవుతుందనే విధానాన్ని శిక్షణ పొందిన వాకతిప్ప గ్రామ కార్యదర్శి వెంకటేశ్వర్లు, అంగర గ్రామ కార్యదర్శి మోహన్ క్లాప్ మిత్రలకు వివరించారు. అనంతరం స్థానిక మండల పరిషత్ కార్యాలయం, గ్రామ పంచాయతీల్లో క్లీన్ అండ్ గ్రీన్ కార్యక్రమాలపై ఎంపీడీవో భానూజీరావు ఆధ్వర్యంలో పంచాయతీల్లో పనిచేస్తున్న క్లాప్‌మిత్ర, షెడ్ మిత్రలకు శిక్షణ నిర్వహించారు. కార్యక్రమంలో డిప్యూటీ ఎంపీడీవో బి.వరప్రసాద్, మండల పరిషత్ కార్యాలయ ఏవో రాజేంద్రప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

మాక్ అసెంబ్లీకి విద్యార్థి ఎంపిక

ఆలమూరు, నవంబరు 21(ఆంధ్రజ్యోతి): భారత రాజ్యాంగ దినోత్సవం సందర్భంగా 26న అమరావతిలో జరగనున్న విద్యార్థుల మాక్ అసెంబ్లీకి ఆలమూరు విద్యార్థి అనుసూరి లోకేష్‌కుమార్ ఎంపికయ్యాడు. మండల, జిల్లాస్థాయిలో విద్యార్థి చూపించిన ప్రతిభకు ఈ విద్యార్థిని ఎంపిక చేశారు. ఆలమూరుకు చెందిన విద్యార్థి తండ్రి సత్యనారాయణమూర్తి వ్యవసాయ కూలీ కాగా, తల్లి అనంతలక్ష్మి గృహిణి. కొత్తపేట నియోజకవర్గానికి స్టూడెంట్ ఎమ్మెల్యేగా ప్రాతినిధ్యం వహించనున్న ఈ విద్యార్థిని కొత్తపేట ఎమ్మెల్యే బండారు సత్యానందరావు అభినందించారు. డీఈవో సలీం బాషా, డీవైఈవో రామలక్ష్మణమూర్తి, ఎంపీడీవో ఎ.రాజు, ఎంఈవోలు బి.అప్పాజీ, ఎన్.రాజు, ఇన్‌చార్జ్ హెచ్‌ఎం సత్యనారాయణమూర్తి, నాయకులు ఈదల సత్తిబాబు, సలాది నాగేశ్వరరావు, ఆర్.శేషగిరిరావు, వాకా గోవిందరాజు, వంటిపల్లి సతీష్‌కుమార్ తదితరులు అభినందించారు.